09-03-2025
ఆదివారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM

ప్రభాత **జయభేరి**

తెలుగు దినపత్రిక

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

సంపుటి : 02 | సంచిక : 169 | పేజీలు : 8 | వెల : 4

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

JB జయభేరి

# నేను ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిని



- నాకు కోట్లాది మంది తల్లులు, సోదరీమణులు, కుమార్తెల ఆశీర్వాదాలు

✍ జయభేరి, హైదరాబాద్, మార్చి 8:

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గుజరాత్ పర్యటనలో ఉన్నారు. ఇక్కడ ఆయన నవ్‌సరిలోని లఖ్‌పతి సోదరీమణులతో సమావేశమయ్యారు. నవ్‌సరిలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ, 'నా జీవితంలో కోట్లాది మంది తల్లులు, సోదరీమణుల ఆశీస్సులు ఉన్నాయి, నేను ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిని. అభివృద్ధి చెందిన భారతదేశం వైపు మహిళలను గౌరవించడం తొలి అడుగు అని ఆయన అన్నారు. ప్రధాని మోదీ ఇక్కడ ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. దీనికి ముందు, అతను ఓపెన్ జీప్‌లో హెలిప్యాడ్ నుండి దాదాపు 700 మీటర్ల రోడ్ షో చేయడం ద్వారా వేదిక వద్దకు చేరుకున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందుకే మహిళా పోలీసు సిబ్బందిని మాత్రమే భద్రతా సిబ్బందిగా నియమించారు. ఇది దేశంలోనే తొలిసారిగా జరుగుతోంది.ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిని అని గర్వంగా చెప్పుకోగలను అని ప్రధానమంత్రి మోదీ అన్నారు. నా జీవిత ఖాతాలో కోట్లాది మంది తల్లులు, సోదరీమణులు, కుమార్తెల ఆశీర్వాదాలు ఉన్నాయి. ఈ ఆశీర్వాదాలు నిరంతరం పెరుగుతున్నాయి. అందుకే ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిని అని చెబుతున్నానని ప్రధాని స్పష్టం చేశారు. బహిరంగ సభలో

...మిగతాది 2 లో

# ఇందిరా మహిళా శక్తి




మహిళలు సాధికారత సాధించే వరకు, తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించడంలో భాగస్వాములయ్యే వరకు ప్రజా ప్రభుత్వం ఆడబిడ్డలకు అండగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. మహిళలు వారి కాళ్ల మీద వారు నిలబడేలా, ఆర్థికంగా నిలబెడుతూ వ్యాపార రంగంలో నిలదొక్కుకునేలా.. రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేసే వరకు విశ్రమించమని స్పష్టం చేశారు.



స్వయం సహాయక సంఘాలకు అప్పగించిన 'ఇందిరా మహిళా శక్తి' బస్సులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. స్వయం సహాయక సంఘాలకు తొలి విడతగా 150 బస్సులను అప్పగించి, వాటిని ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే ఈ వినూత్న కార్యక్రమాన్ని "ప్రపంచ మహిళా దినోత్సవం" రోజున శ్రీకారం చుట్టారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ప్రజా ప్రతినిధులు, ఆర్టీసీ ఎండీతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

✍ జయభేరి, హైదరాబాద్ :

మహిళలు సాధికారత సాధించే వరకు, తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించడంలో భాగస్వాములయ్యే వరకు ప్రజా ప్రభుత్వం ఆడబిడ్డలకు అండగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. మహిళలు వారి కాళ్ల మీద వారు నిలబడేలా, ఆర్థికంగా నిలబెడుతూ వ్యాపార రంగంలో నిలదొక్కుకునేలా.. రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేసే వరకు విశ్రమించమని స్పష్టం చేశారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో స్వయం సహాయక సంఘాల "ఇందిరా మహిళా శక్తి" భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి మహిళల ఆర్థిక తోడ్పాటు కోసం పలు వరాలను ప్రకటించారు. ఆడబిడ్డలందరికీ ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రసంగించిన ముఖ్యమంత్రి మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేపట్టిన, చేపట్టబోయే కార్యక్రమాలను విశదీకరించారు. "రాబోయే రోజుల్లో

...మిగతాది 2 లో

# బడ్జెట్ సమావేశాలకు కేసీఆర్

✍ జయభేరి, హైదరాబాద్, మార్చి 8:



తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ ఏడాది గ్యాప్ తరువాత అసెంబ్లీకి వచ్చేందుకు సిద్ధమైయ్యారనే వార్త బిఆర్ఎస్ క్యాడర్ లో మాంచి జోష్ నింపింది. అవును మీరు వింటున్నది నిజమే , ఈ నెల 12వ తేది నుండి జరగనున్న తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరైయ్యేందుకు కేసీఆర్ నిర్ణయించుకున్నారట. సరిగ్గా ఏడాది క్రితం బడ్జెట్ సమావేశాలకు అసెంబ్లీకి వచ్చినా , అది ఒక్కరోజే , అలా బడ్జెట్ అవ్వగానే, ఇలా మీడియా పాయింట్ లో మాట్లడి వెళ్లిపోయారు. అది మొదలు ఆ తరువాత అసెంబ్లీ వైపే కన్నెత్తి చూడలేదు గులాబి బాస్ . కానీ సారి అలా కాదట, అది కొత్త ప్రభుత్వం కాబట్టి వదిలేశాం , ఇప్పుడు అలా కాదు..గులాబి గట్టిదెబ్బ ఎలా ఉంటుందో చూపిస్తామంటున్నారట కేసిఆర్. తాజాగా క్యాబినేట్ నిర్ణయంతో అసెంబ్లీ సమావేశాల తేదీలు ఖరారైయ్యాయి. ఈనెల 12వ తేది నుండి 27వ తేది వరకూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

...మిగతాది 2 లో

# మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి



- ప్రభుత్వం నుంచి మహిళలకు మరింత ప్రోత్సాహకాలు
- సంపాదనలో మగవారికంటే మహిళలే మెరుగ్గా రాణిస్తున్నారన్న చంద్రబాబు
- ఏఐలోనూ మహిళలు రాణించాలని ఆకాంక్ష.. సీఎం చంద్రబాబు

✍ జయభేరి, అమరావతి:

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, ఇందుకోసం ఎన్డీయే ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా ఎలీప్, ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ ఏపీ, ఆధ్వర్యంలో విజయవాడలో శుక్రవారం రాత్రి జరిగిన న్యూ జనరేషన్ టెక్కేడ్ ఫర్ సస్టైనబుల్

...మిగతాది 2 లో




# త్వరలో 3,500 ఇందిరమ్మ ఇండ్లు

✍ జయభేరి, హైదరాబాద్:

రాష్ట్రంలో అర్హులైన ప్రతిఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరి చేసేలా తెలంగాణ సర్కార్ అడుగులు వేస్తోంది ఈ క్రమంలో తొలి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేయనుంది. ఇందుకోసం ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం అర్హులను ఎంపిక చేసింది. తొలి విడతలో ఇప్పటికే 72,045 మంది లబ్ధిదా రులకు అధికారులు ఇళ్లను మంజూరు చేశారు. ప్రస్తుతం అర్హుల లిస్టు

...మిగతాది 2 లో



# అనంతలో పెట్రోల్ మోసం

✍ జయభేరి, అనంతపురం మార్చి 8:

మనం పెట్రోల్ బంకులోకి వెళ్లి ట్యాంకులో పెట్రోల్ కొట్టించుకుంటాం. ఇప్పుడు ఎవరూ లీటర్లలో కొట్టించుకోవడం లేదు. వంద .. రెండు వందలు అని లెక్కవేసి కొట్టించుకుంటున్నారు. ఇక్కడే అతి పెద్ద స్కాంకు పెట్రోల్ బంకుల యజామాన్యాలు తెరలేపాయి. లీటర్‌కు 60 నుంచి 100 ఎంఎల్ వరకూ ఎక్కువ రీడింగ్ వచ్చేలా డిస్పెన్సర్ చిప్‌లను రీ ప్రోగ్రామించి చేసి కోట్లు కొట్టేస్తున్నారు. అనంతపురం జిల్లాలో ఈ మోసం వెలుగు చూసింది. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ , లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పెట్రోల్ బంకుల పైన దాడులు చేశారు. ఈ సందర్భంగా తనిఖీలు చేయడంతో నయా మోసం బట్టబయలైంది. అనంతపురం నగరంలోని జయలక్ష్మి ఆటో కేర్, ఎస్ పి అండ్ సన్స్, విజయ ఫిల్లింగ్ స్టేషన్ పెట్రోల్ పంపులు డిస్పెన్సింగ్ యూనిట్ (డియూ)కి చిప్ నీ అమర్చి వినియోగదారులకు తక్కువ పెట్రోల్ అంటగట్టి ఏడాదిలో కోట్లకు కోట్లు కొల్లగొడుతున్నట్లుగా గుర్తించారు. 2023 సంవత్సరం కంటే ముందు తయారి

...మిగతాది 2 లో

## భారత్ ఆధీనంలోకి పీఓకే !

2 లో

మొదటిపేజీ తరువాయి

## ఇందిరా మహిళా శక్తి

మహిళా సంఘాలకు రైస్ మిల్లులు పెట్టించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేసుకోవడానికి గోడౌన్లను కట్టించడం, ఆ వద్దనే మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వమే స్థలం ఇస్తుంది. ప్రభుత్వమే రుణాలు ఇప్పిస్తుంది. మీరే గోడౌన్లు కట్టండి. మీరే రైసు మిల్లులు పెట్టండి. మీకు అండగా ప్రభుత్వం నిలబడుతుంది. మిమ్మల్ని వ్యాపారస్తులుగా నిలబెడతాం. మీ కాళ్ల మీద మీరు నిలబడాలి. ఆర్థికంగా నిలదొక్కుకోవాలి. రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తయారు చేయాలి. ఆడబిడ్డలు ఎదిగితేనే అది సాధ్యపడుతుంది. మహిళా సంఘాల్లో ప్రస్తుతం ఉన్న 65 లక్షల సభ్యుల నుంచి కోటి మందిని చేర్పించాలి. అందుకు కొన్ని నిబంధనలు అడ్డొస్తున్నాయంటే వాటిని సడలించాం. సభ్యత్వం చేరడానికి కనిష్ట వయో పరిమితిని 18 నుంచి 15 ఏళ్లకు తగ్గించాం. సభ్యత్వం పూర్తి కావడానికి గరిష్ట పరిమితిని 60 నుంచి 65 ఏళ్లకు పెంచాం. ఎవరికో లీజుకు ఇవ్వడంకన్నా ఆడబిడ్డలకు వెయ్యి బస్సులు కొనిచ్చి ఆర్టీసీకి అద్దెకు ఇస్తాం. ఇప్పుడే 150 బస్సులను ప్రారంభించాం. రాబోయే రోజుల్లో 1000 ఎలక్ట్రిక్ బస్సులకు ఆడబిడ్డలు యజమానులు కాబోతున్నారు. తద్వారా ప్రతి నెలా లక్ష రూపాయలు సంపాదించుకునే అవకాశం లభిస్తుంది. చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు వస్తున్నాయి. రాబోయే ఎన్నికల్లో 33 శాతం మంది ఆడబిడ్డలు ఎమ్మెల్యేలు, ఎంపీలు కాబోతున్నారు. మీలో నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోండి. సమాజ సేవ చేయాలన్న ఆలోచనతో ముందుకు రావాలి. ఆదిలాబాద్ గిరిజన కళా రూపాలు, నిర్మల్ బొమ్మలు, తినుబండారాలు... ఏవైనా కావొచ్చు స్వయం సహాయ సంఘాలు చేసే ఉత్పత్తులను కార్పొరేట్ కంపెనీలతో పోటీ పడుతూ అంతర్జాతీయంగా మార్కెటింగ్ చేసుకోవడానికి వీలుగా శిల్పారామం పక్కన 150 షాపులు కేటాయించాం. రాబోయే రోజుల్లో మీ ఉత్పత్తులపై పన్నులేమైనా ఉంటే రాబోయే రోజుల్లో వాటిని మినహాయింపు ఇవ్వడానికి ప్రయత్నిస్తాం. 65 లక్షల మంది సంఘాల్లో ఉన్న వారి పిల్లలే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. అందుకే ఆ పాఠశాలల నిర్వహణను స్వయం సహాయక సంఘాలకు అప్పగించాం. అలాగే విద్యార్థినీ విద్యార్థులకు 1 కోటి 30 లక్షల పిల్లలకు బట్టలు కుట్టించే కార్యక్రమం ఆడబిడ్డలకు అప్పగించాం. జిల్లా కేంద్రాల్లో మహిళా సంఘాలు ఉండాలన్న లక్ష్యంతో ప్రతి జిల్లాకు ఇందిరా మహిళా శక్తి భవనాలు ఉండాలని, ప్రతి జిల్లాకు 25 లక్షల రూపాయలు కేటాయిస్తున్నం. 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసి ప్రభుత్వానికి అందించే విధంగా ఒప్పందం చేశాం. గ్రామీణ ప్రాంతాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణను స్వయం సంఘాలకు అప్పగించాం. వారు నిర్వహించినప్పుడే ఆ పాఠశాలల పరిస్థితి మెరుగుపడుతాయని అప్పగించాం. రాష్ట్రంలో 1.30 కోట్ల స్కూల్ యూనిఫామ్స్ కుట్టించే పనులను కూడా మహిళా సంఘాలకే అప్పగించాం. కుట్టుకూలి గిట్టుబాటు కావాలన్న ఉద్దేశంతో ధరను 75 రూపాయలకు పెంచాం". అని ముఖ్యమంత్రి గారు వివరించారు. అనంతరం ఇందిరా మహిళా శక్తి మిషన్ 2025 పాలసీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఇదే వేదికగా 2,82,552 సంఘాలకు సంబంధించి రూ. 22,794 వేల కోట్ల చెక్కును అందజేశారు. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబోయే సోలార్ ప్లాంట్‌స్‌కు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. బీమా పథకాల నిధులను విడుదల చేశారు.

## త్వరలో 3,500 ఇందిరమ్మ ఇండ్లు

ప్రకటించిన గ్రామాలను మినహాయించి మిగిలిన గ్రామాల్లో అర్హుల ఎంపికపై అధికారులు దృష్టి సారించారు. తొలి విడతలో ఇంటి స్థలం ఉన్నవారికి ఇళ్లు మంజూరి చేసేలా అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారు. తాజాగా. రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల మంజూరిపై కీలక విషయాన్ని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శుభవార్త అందించారు. మరోవారం రోజుల్లో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే కార్యక్రమం చేపడతామని చెప్పారు. అర్హులైన వారిని ఎంపిక చేసి, పనులు మొదలు పెడతామని అన్నారు. జాబితాలో పేర్లు రానివారికి ఆందోళన అవసరం లేదని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియ. మరో విడతలో లబ్ధిదారులను గుర్తించి ఎంపిక చేస్తామని చెప్పారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ పైనా మంత్రి శ్రీనివాస్ రెడ్డి కీలక విషయాన్ని చెప్పారు. మార్చి నెలాఖరులోగా రాష్ట్రంలో రేషన్ కార్డుల జారీ ప్రక్రియ చేపడతామని చెప్పారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకొని సరిగ్గా 15నెలలు అవుతుంది ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

## మహిళలు పారిశ్రామిక వేత్తలుగా..

ఎంటర్‌ప్రైజెస్ అంతర్జాతీయ సదస్సులో ఆయన మహిళా పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. అనకాపల్లి జిల్లా కోడూరులో ఎలీప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న హరిత పారిశ్రామిక పార్క్‌కు సంబంధించిన శిలాఫలకాన్ని ఇదే వేదిక పక్కన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ. ప్రస్తుతం మహిళలు సంపాదనలో పురుషుల కంటే మెరుగ్గా రాణిస్తున్నారని అన్నారు. అన్ని రంగాల్లో అపారమైన సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నారని తెలిపారు. శ్రామిక శక్తిలో మహిళలు లేకుండా పురోగతి అసాధ్యమని వివరించారు. ప్రపంచ దేశాల్లో కెల్లా భారతదేశంలో మహిళల శ్రామిక శక్తి భాగస్వామ్యం గణనీయంగా పెరిగిందని అన్నారు. 30 ఏళ్ల క్రితం వంటింటికే పరిమితమైన మహిళలు ఇప్పుడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు.

**ఇన్నోవేషన్ హబ్‌ల ద్వారా మద్దతు:**

రాష్ట్రంలో వ్యాపారం ప్రారంభించాలనుకున్న ఏ మహిళకైనా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా నిర్మాణాత్మకమైన మద్దతును అందిస్తామని ముఖ్యమంత్రి అన్నారు. మహిళలను అన్ని రకాలుగా ముందుకు నడిపించేందుకు కృషి చేస్తామని వివరించారు. ఈ విషయం తాను ఇప్పుడు మాట్లాడటం కాదు రాబోయే రోజుల్లో ఫలితాలను కూడా చూపిస్తానని తెలిపారు. అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుని మహిళలను ప్రోత్సహించి అద్భుతాలను సృష్టిస్తామని అన్నారు.

**ఏఐలోనూ మహిళలు రాణించాలి**

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి మహిళ కూడా ఏఐలో రాణించాలని, భవిష్యత్ అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దేనని అన్నారు. మీరు ఆఫీసులో పని చేసి ఇంటికి వెళ్లేముందు ప్రోగ్రామ్ చేసుకుని ఇంటికి చేరుకునే సమయానికి ఆహారాన్ని సిద్ధంగా ఉంచుకోవచ్చు. నూతన ఆవిష్కరణలే మన జీవితాలను మార్చుతాయి. స్వర్ణాంధ్ర విజన్ 2047 ప్రకారం 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీని ఆవిష్కరించాలన్న ఉద్దేశంతో విజన్‌ను రూపొందించాం. ఆంధ్రప్రదేశ్‌ను ఆర్థికంగా ప్రపంచంలోనే నెంబర్ 1గా నిలిపి 15 శాతం వృద్ధి రేటు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం' అని సీఎం చంద్రబాబు అన్నారు.

**డిజిటల్ అక్షరాస్యత అవసరం:**

నిరంతర అభ్యాసం ప్రతి ఒక్కరికీ అవసరం. అభ్యాసం అనేది జీవితాంతం కొనసాగే ప్రక్రియ, తద్వారా అపారమైన జ్ఞానాన్ని పొందగలం. ప్రపంచం వేగంగా మారుతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ నైపుణ్యాలను పెంచుకోవాలి. డిజిటల్ టెక్నాలజీ ప్రయోజనాలను పొందాలంటే డిజిటల్ అక్షరాస్యత తప్పకుండా అవసరం. పౌరులు టెక్నాలజీతో పాటు సెల్‌ఫోన్‌లను కూడా విరివిగా వినియోగించాలి. ప్రస్తుత కాలంలో భార్య లేకుండా భర్త, భర్త లేకుండా భార్య జీవించగలుగుతున్నారు కానీ సెల్‌ఫోన్ లేకుండా ఏ ఒక్కరూ ఉండలేకపోతున్నారు. మహిళలు పని, గృహ బాధ్యతలను సమర్థవంతంగా సమతుల్యం చేసుకోవడానికి వీలుగా రాష్ట్రంలో వర్క్ ఫ్రం హోం విధానాన్ని తీసుకురాబోతున్నాం. మహిళలు నూతన ఆవిష్కరణలను తీసుకురావాలి. మహిళా సాధికారతకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుంది. మహిళా పారిశ్రామికవేత్తలు ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలి. అవకాశాలను అంచనా వేసుకుని, రాష్ట్ర పురోగతికి సమష్టిగా పనిచేయాలి. రాష్ట్ర అభివృద్ధికి అందరం కలిసి పనిచేద్దాం. కార్యాచరణ, ఆవిష్కరణల ద్వారా ఏపీని ఎంట్రప్రెన్యూర్‌లకు కేంద్రంగా మార్చేందుకు కృషి చేసి రాష్ట్రాన్ని ఉజ్వల భవిష్యత్తు వైపు నడిపించేందుకు అందరం పనిచేద్దాం'' అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

ఎలీప్ ప్రెసిడెంట్ రమాదేవి మాట్లాడుతూ. మహిళా పారిశ్రామికవేత్తలకు చంద్రబాబు గాడ్ ఫాదర్ అని కొనియాడారు. ఉమ్మడి ఏపీలోని మొదటి పారిశ్రామిక పార్క్ కు ఆయన గాజుల రామారంలో శంకుస్థాపన చేశారని, అది ప్రపంచానికే ఆదర్శంగా ఎదిగిందన్నారు. సరైన వసతులు కల్పిస్తే పురుషులకు ఏ మాత్రం తీసిపోని రీతిలో మహిళా పారిశ్రామికవేత్తలు దూసుకెళతారని నిరూపిస్తున్నారని అన్నారు.

# భారత్ ఆధీనంలోకి పీఓకే !

**పాకిస్తాన్ ఇప్పుడో సమస్యల పుట్ట. ప్రజలకు మూడు పూటలా తిండి పెట్టే పరిస్థితి లేదు. కనీస అవసరాలు తీర్చే అవకాశాలు లేవు. ఇది సరిపోదన్నట్టుగా పాలు పోసి పెంచిన ఉగ్రవాదం ఆ దేశంపైనే తిరగబడుతున్న పరిస్థితి. అది కూడా సరిపోదన్నట్టుగా అణచివేస్తున్నారంటూ ఆక్రమిత కశ్మీర్ ప్రజలు ప్రభుత్వంపై విరుచుకుపడున్నారు. మరే దేశానికైనా ఇన్ని సమస్యలుంటే పరిష్కారాల కోసం పాలకులు పని చేస్తారు. ఎలాగోలా ఆ కష్టాల నుంచి దేశాన్ని బటయపడేస్తారు. కానీ, పాకిస్తాన్ పాలకులకు మాత్రం దేశంలో ఎన్ని సమస్యలు ఉన్నా వాటన్నింటికీ ఒక్కటే సొల్యూషన్. అదే కశ్మీర్.!**



రాజకీయంగా పబ్బం గడుపుకోడానికి కశ్మీర్ అంశం వారికో అక్షయ పాత్రలా మారింది. ఇప్పుడు కూడా అదే చేసి ఇండియాతో చీవాట్లు తింది. మరో వైపు క్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌కు అప్పగిస్తే కశ్మీర్ సమస్యకు తుది పరిష్కారం లభిస్తుందన్నారు విదేశాంగశాఖ మంత్రి జైశంకర్. లండన్ పర్యటనలో ఖలిస్తాన్ వేర్పాటువాదులు ఆయన కాన్వాయ్‌పై దాడికి ప్రయత్నించడంపై విదేశాంగశాఖ మండిపడింది. తమ దేశంలో ఇలాంటి అరాచకాలు సహించేది లేదని ఖలిస్తాన్ వేర్పాటువాదులను బ్రిటన్ ప్రభుత్వం హెచ్చరించింది. లండన్ పర్యటనలో ఒకేసారి అటు ఖలిస్తాన్ వేర్పాటువాదులు , ఇటు కశ్మీర్ వేర్పాటువాదులకు ధీటైన సమాధానం ఇచ్చారు విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ . కశ్మీర్ సమస్యకు ఎప్పుడు పరిష్కారం లభిస్తుందని ప్రశ్నించిన పాక్ జర్నలిస్ట్‌కు దిమ్మతిరిగే సమాధానం ఇచ్చారు. భారత్ నుంచి దొంగిలించిన కశ్మీర్ భూభాగాన్ని తిరిగి ఇచ్చినప్పుడే ఈ సమస్యకు తుది పరిష్కారం లభిస్తుందన్నారు. ఆర్టికల్ 370 రద్దు తరువాత జమ్ముకశ్మీర్ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు జైశంకర్. అంతేకాకుండా అక్కడ అసెంబ్లీ ఎన్నికలను కూడా విజయవంతంగా ముగించినట్టు చెప్పారు. కశ్మీర్ ప్రజలకు ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయాన్ని అందించినట్టు ప్రకటించారు. జైశంకర్ పర్యటన సందర్భంగా లండన్‌లో ఖలిస్తాన్ వేర్పాటువాదులు మళ్లీ రెచ్చిపోయారు. జైశంకర్ కాన్వాయ్‌పై దాడికి ప్రయత్నించారు. జైశంకర్ కారు ముందు భారత త్రివర్ణ పతాకాన్ని అవమానించారు. ఈ ఘటనపై విదేశాంగశాఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది . భద్రతా లోపాలు బయటపడ్డాయిని , అరాచకశక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసంది.లండన్ లోని ఛాథమ్ హౌస్‌లో అధికారిక సమావేశాలు ముగించుకున్న జైశంకర్ బయటకు వచ్చారు. అదే సమయంలో ఖలిస్థానీ వాదులు అక్కడ ఆందోళన చేపట్టారు. ఖలిస్తాన్ జెండాలతో నిరసన తెలిపారు. ఓ దుండగుడు విదేశాంగ మంత్రి కారు వద్దకు దూసుకొచ్చాడు. అతడి చేతిలో భారత జాతీయ జెండా ఉండగా దాన్ని అవమానించేలా ప్రవర్తిస్తూ నినాదాలు చేశాడు. అప్రమత్తమైన లండన్ పోలీసులు వెంటనే అతడిని పట్టుకున్నారు. ఖలిస్తాన్ అనుకూల వాదులను లండన్ పోలీసులు అరెస్ట్ చేశారు. బ్రిటన్ విదేశాంగశాఖ కూడా ఈ వ్యవహారంపై స్పందించింది. శాంతియుత నిరసనలకు మాత్రమే తమ దేశం అనుమతిస్తుందని, హింసకు పాల్పడితే సహించేది లేదని ఖలిస్తాన్ వాదులను బ్రిటన్ ప్రభుత్వం హెచ్చరించిందిపాకిస్తాన్ నేషనల్ అసెంబ్లీలో కీలక చర్చ జరుగుతోంది. అప్పుడే ఆ దేశ మంత్రి ఇంజనీర్ అమీర్ ముకమ్ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆ తీర్మానం సారాంశం మన కశ్మీర్‌లో ప్రజల హక్కుల కోసం పాక్ నైతిక, రాజకీయ, దౌత్యపరమైన మద్దతు ఇస్తుందని చెప్పడం. అంతేకాదు, కశ్మీర్‌లో ప్రజలు ప్రజాస్వామ్య హక్కులను వినియోగించుకునేందుకు వీలుగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానాలను భారత్ అమలు చేయాలనీ.. కశ్మీర్‌లో ప్రజాభిప్రాయ సేకరణకు అనుమతించాలని తీర్మానం చేశారు. ఆ తీర్మానా న్ని ఆ దేశ పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించింది కూడా. ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే ఆ తీర్మానాన్ని అక్కడి విపక్షాలు బాయ్‌కాట్ చేశాయి. ఇదే సమయంలో ఐక్యరాజ్యసమితిలో చర్చ సందర్భంగా పాకిస్తాన్ తీరుపై భారత ప్రతినిధి నిప్పులు చెరిగారు. గతేడాదే కశ్మీర్‌లో ప్రభుత్వాన్ని ఎన్నుకోడానికి ప్రజలు పెద్ద ఎత్తున ఓట్లు వేశారనీ, కొత్తగా ఓటింగ్ నిర్వహించాల్సిన అవసరం లేదన్నారు. కశ్మీర్‌పై పనికి మాలిన ఆరోపణలు మానేసి పాకిస్తాన్ తన అంతర్గత సమస్యలపై ఫోకస్ పెట్టాలని గడ్డి పెట్టారు. కశ్మీర్‌పై పాకిస్తాన్ తీర్మానం విషయానికి వస్తే.. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానాలను భారత్ అమలు చేయాలనేది దాని అసలు పాయింట్. కాని, అందులో అసలు పాయింటే లేదు. ఒక్కసారి చరిత్రలోకి వెళితే ఆ క్లారిటీ పాకిస్తాన్‌కు వస్తుంది. కశ్మీర్ ఒకప్పుడు స్వతంత్ర సంస్థానం. 1947లో బ్రిటిష్ పాలన ముగిశాక సంస్థానాలపై సర్వాధికారాలు వాటి ప్రభువుల చేతికి వచ్చాయి. భారత్, పాకిస్తాన్ విభజన జరిగిన తర్వాత పూర్వపు సంస్థానాల్లో ఏది ఎటు చేరాలన్న ప్రశ్న వచ్చింది. తమ సంస్థానం భారత్, పాక్ రెండింట్లో ఏ దేశంలో కలిసేదీ నిర్ణయించే అధికారం ఇండియన్ ఇండిపెండెన్స్ యాక్టు సంస్థానాధీశులకి ఇచ్చింది. ఆ ప్రకారం జమ్మూ కశ్మీర్ మహారాజు హరిసింగ్ నిర్ణయం చేసేలోపే పాకిస్తాన్ దుర్మార్గంగా దండెత్తించింది. జనావాసాలను కబళిస్తూ పాక్ సైన్యం శ్రీనగర్ దరిదాపులకు వచ్చేసింది. ఆ దశలో కశ్మీర్ మహారాజు హరిసింగ్ తన రాజ్యాన్ని భారత్‌లో చట్టబద్ధంగా, యథావిధిగా విలీనం చేశారు. జమ్మూకశ్మీర్ ఎప్పుడైతే భారత్‌లో విలీనమైందో, దాని ప్రాదేశిక సమగ్రతను రక్షించటం భారత ప్రభుత్వ బాధ్యతైంది. ఆ వెంటనే కశ్మీర్‌లోకి దూసుకొస్తున్న పాక్ సైన్యాన్ని అడ్డుకునేందుకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ రంగంలోకి దిగింది.పాకిస్తాన్ ఆక్రమించుకున్న ఒక్కో ప్రాంతాన్నీ సాధించుకుంటూ ఆర్మీ ముందుకు కదిలింది. మరికొన్ని రోజులు అదే పోరాటం జరిగితే ప్రస్తుతం పీవోకేగా చెబుతున్న ప్రాంతం అప్పుడే ఇండియాలో అంతర్భాగమై ఉండేది. కానీ, అలా జరగలేదు. ఆర్మీ జనరల్స్ వద్దన్నా వినకుండా సైనిక చర్యలను అర్థాంతరంగా ఆపించేశారు నెహ్రూ. పాక్‌పై ఫిర్యాదు చేస్తూ ఐక్యరాజ్యసమితి గడప తొక్కారు. మహారాజు సంతకంతో ఖరారైపోయిన విలీనాన్ని స్వయంగా తానే తిరగదోడారు. ప్రజాభిప్రాయ సేకరణ జరగాలంటూ దేశంలో మరే సంస్థానానికీ పెట్టని షరతు జమ్మూ కశ్మీర్ విషయంలో ఎవరూ అడక్కుండానే చొప్పించారు. ఆక్రమించిన ప్రాంతాలనుంచి పాకిస్తాన్ వైదొలిగాక ప్లెబిసైట్ జరిపించడానికి ఐక్యరాజ్యసమితి సైతం ఓకే చెప్పింది. అయితే, ఆ ప్రకారం వైదొలగడానికి పాకిస్తాన్ నిరాకరించింది. ఇలా మన కశ్మీర్ పాకిస్తాన్‌లో అంతర్భాగమై పడరానిపాట్లు పడుతోంది. ఇది ఎవరూ చెరిపేయలేని నిజం.నిజానికి.. మెజారిటీ ప్రజలు తమను భారత్‌లో విలీనం చేయాల్సిందిగా ఓటు వేస్తే పీవోకే భారత్‌లో కలిసి తీరాల్సిందే. అందుకు, సంబంధించిన రిజల్యూషన్ 1948లోనే ఆమోదం పొందింది. 1948లో అప్పటి ప్రధాని నెహ్రూ కశ్మీర్ సమస్యని ఐక్యరాజ్యసమితికి నివేదించడం వలన యూఎన్ ఈ రిజల్యూషన్‌ను అమోదించింది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో రెఫరెండం నిర్వహించి, ఓటింగ్ ఆధారంగా అక్కడి ప్రజలు ఎటు వైపు ఉండాలో నిర్ణయించుకుంటారనీ, దాని ప్రకారమే పీవోకే భవిష్యత్ నిర్ణయం జరుగుతుందనేదీ తీర్మానం సారాంశం. పీవోకేలో ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయిన తర్వాత భారత్ అధీనంలో ఉన్న కశ్మీర్ ప్రాంతంలో రెఫరెండం నిర్వహించాలని పేర్కొంది ఐక్యరాజ్యసమితి. కానీ అప్పట్లో రెఫరెండం నిర్వహించడానికి పాకిస్తాన్ నిరాకరించింది. ఐక్యరాజ్యసమితి జస్ట్ భారత కశ్మీర్‌లో మాత్రమే రెఫరెండం నిర్వహించాలని తీర్మానం చేసిందనీ, పీవోకేలో కాదని వాదించింది. వాస్తవం ఏంటంటే..మొదట పాకిస్తాన్ తన అధీనంలో ఉన్న కశ్మీర్, గిల్గిట్ బాల్టిస్తాన్‌లలో రెఫరెండం నిర్వహించాలి. అది కూడా ఐక్యరాజ్యసమితి పరిశీలక బృందం పర్యవేక్షణలోనే జరగాలి. కాని, ఇప్పటి వరకూ అది జరగలేదు. ఎందుకంటే, రెఫరెండం నిర్వహిస్తే జరిగేదేంటో ఇస్లామాబాద్‌కు తెలుసు కాబట్టి. ఇవన్నీ తెలిసి కూడా పాకిస్తాన్ ప్రజలను మభ్యపెట్టేందుకు మన కశ్మీర్‌పై తీర్మానాలతో టైం వేస్ట్ చేస్తోంది. పాకిస్తాన్‌కు బుద్ధి రావాలంటే పీవోకేను సైనిక చర్యతో భారత్‌లో విలీనం చేయాలి. అప్పుడుకానీ ఇస్లామాబాద్ దారికిరాదు.

> **శాంతియుత నిరసనలకు మాత్రమే తమ దేశం అనుమతిస్తుందని, హింసకు పాల్పడితే సహించేది లేదని ఖలిస్తాన్ వాదులను బ్రిటన్ ప్రభుత్వం హెచ్చరించిందిపాకిస్తాన్ నేషనల్ అసెంబ్లీలో కీలక చర్చ జరుగుతోంది. అప్పుడే ఆ దేశ మంత్రి ఇంజనీర్ అమీర్ ముకమ్ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆ తీర్మానం సారాంశం మన కశ్మీర్‌లో ప్రజల హక్కుల కోసం పాక్ నైతిక, రాజకీయ, దౌత్యపరమైన మద్దతు ఇస్తుందని చెప్పడం. అంతేకాదు, కశ్మీర్‌లో ప్రజలు ప్రజాస్వామ్య హక్కులను వినియోగించుకునేందుకు వీలుగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానాలను భారత్ అమలు చేయాలనీ.. కశ్మీర్‌లో ప్రజాభిప్రాయ సేకరణకు అనుమతించాలని తీర్మానం చేశారు.**

## బడ్జెట్ సమావేశాలకు కేసీఆర్

జరగబోతున్నాయి. ఈనేపథ్యంలో సమావేశాల మొదటి రోజునుండే ఈసారి కేసీఆర్ హాజరు కాబోతున్నారని సన్నిహితుల చెప్పేశారట. గత ఏడాది బడ్జెట్ అవ్వగానే రావడం కాకుండా ఈసారి బడ్జెట్ లో లోపాలు, కేటాయింపులను ఎత్తిచూపడంతోపాటు ,పెండింగ్ ప్రాజెక్టుల మొదలు ఆరు గ్యారంటీల వరకూ అసెంబ్లీలోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చుక్కలు చూపించాలని ఫిక్స్ అయ్యారట కేసీఆర్. ఇప్పటి నుండి క్యాడర్ కు సంకేతాలు ఇవ్వడంతోపాటు అధికార పార్టీని ఇరుకున పెట్టే వ్యూహాలకు పదును పెట్టార పెద్దాయన.అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తరువాత ఎక్కువశాతం ఫామ్ హౌస్ నుండే పార్టీని నడిపిస్తున్న కేసీఆర్. గత ఏడాది మూడు సార్లు మాత్రమే తెలంగాణ భవన్ లో పార్టీనేతలు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించారు. రెండు వారాల క్రితం జరిగిన పార్టీ సమావేశంలో ఇకపై ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.అంతేకాదు అన్ని గమనిస్తున్నాని , నేను కొడితే దెబ్బ ఎలా ఉంటదో చూపిస్తానంటూ హాట్ కామెంట్స్ తో బిఆర్ ఎస్ క్యాడర్ లో కొత్త జోష్ నింపారు. అలా దాదాపు తక్కువ సందార్భాల్లో మాత్రమే బయటకు వస్తూ, అరుదుగా మాత్రమే మాట్లడుతున్న కేసీఆర్ పై గత కొంత కాలంగా అధికార కాంగ్రెస్ గట్టిగానే కౌంటర్ ఇస్తోంది. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి మాట్లడాలి కేసీఆర్ అంటూ ఆ పార్టీ మంత్రులు బహిరంగ సవాలు విసురుతున్నారు. ఎవరు ఇంతలా టార్గెట్ చేసినా , వ్యూహాత్మక మౌనం వహించిన కేసీఆర్ ఇప్పుడు అసెంబ్లీకి వెళ్లాల్సిన టైమొచ్చిందని ఫిక్సైయ్యాట.ఆరు గ్యారెంటీల అమలులోనూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. పథకాలు అమలు ప్రారంభించినా, లబ్ధిదారుల నుండి విమర్శలు వినిపిస్తున్నాయి. నిరుద్యోగుల ఆందోళనలు,రైతుల సాగునీటి కష్టాలు, ఆర్థిక భారంతో రైతు ఆత్మహత్యలు, ముందుకు సాగని సాగునీటి ప్రాజెక్టులు ఇలా వీటికితోడు రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చేందుకు ఇచ్చిన 420హామీలు ఇలా ఇవన్నీ నిలదీయాల్సిన సమయం ఇదేనని భావించిన గులాబి బాస్ రాబోయే అసెంబ్లీ సమావేశలు వేదికగా దూసుకుపోనున్నారటఇదిలా ఉంటే కేసీఆర్ అసెంబ్లీకి రావడంలేదంటూ హైకోర్టులో ఇప్పటికే పిటీషన్ దాఖలైయ్యింది. అనర్హత వేటు కూాడా వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో ఇక దుమ్మా కొట్టడం అన్ని విధాలా అనుకూలం కాదనే రంగంలోకి దిగుతున్నట్లు సమాచారం. అయితే బిఆర్ స్ కేడర్ నుండి విభిన్న వాదనలు విపిస్తున్నాయి. కేసీఆర్ వయసుకు కూడా గౌరవం ఇవ్వకుండా కాంగ్రెస్ నేతలు అసెంబ్లీలో దిగజారి మాట్లడతారు, దూరంగా ఉంటే మంచదని కొందరంటుంటే, కాదు కేసీఆర్ రావాలి, రేవంత్ ప్రభుత్వాన్ని అసెంబ్లీనే నిలదీయాలని మరో వర్గం నేతలు భావిస్తున్నారట. మొత్తానికి ఎవరి అభిప్రాయం ఎలా ఉన్నా కేసీఆర్ మాత్రం అసెంబ్లీకి ఈసారి కచ్చితంగా వస్తున్నారని ఆయన సన్నిహితులు తేల్చేశారు.

## నేను.. ధనవంతుడిని



ప్రసంగిస్తూ ప్రధాని మోదీ, మహిళా దినోత్సవం, మాతృభూమి గుజరాత్‌లో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రత్యేక రోజున ఇంత పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై, వారి ప్రేమ, ఆప్యాయత, ఆశీర్వాదాలకు నేను మాతృశక్తికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని మోదీ అన్నారు. గుజరాత్ సఫల్ - గుజరాత్ మైత్రి అనే రెండు పథకాలను ప్రధాని మోదీ ఇక్కడి నుంచి ప్రారంభించారు. అనేక పథకాల నుండి డబ్బును నేరుగా మహిళల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయడం జరిగింది. దీనికి అభినందనలు తెలిపిన ప్రధాని మహిళలకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు.భారతదేశం మహిళల నేతృత్వంలోని అభివృద్ధి మార్గంలో పయనించిందని ఆయన అన్నారు. మా ప్రభుత్వం మహిళల జీవితాల్లో గౌరవం, సౌలభ్యం రెండింటికీ అత్యంత ప్రాధాన్యతనిస్తుంది. కోట్లాది మంది మహిళలకు మరుగుదొడ్లు నిర్మించడం ద్వారా వారి గౌరవాన్ని పెంచామన్నారు. కోట్లాది మంది మహిళలను వారి ఖాతాలను తెరవడం ద్వారా బ్యాంకింగ్‌కు అనుసంధానించామన్నారు. ఉజ్వల సిలిండర్లను అందించడం ద్వారా, మహిళలను పొగ వంటి సమస్యల నుండి రక్షించామని ప్రధాని మోదీ తెలిపారు. సామాజిక స్థాయిలో, ప్రభుత్వ స్థాయిలో, పెద్ద సంస్థలలో, మహిళలకు మరింత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది అది రాజకీయ రంగం అయినా, క్రీడా రంగం అయినా, న్యాయవ్యవస్థ అయినా, పోలీసులైనా.. దేశంలోని ప్రతి రంగంలోనూ, ప్రతి కోణంలోనూ మహిళల జెండా ఎగురుతోందని ప్రధాని పేర్కొన్నారు.దేశ ఆత్మ గ్రామీణ భారతదేశంలో నివసిస్తుందని గాంధీజీ చెప్పేవారు అని ప్రధాని మోదీ సమావేశంలో అన్నారు. గ్రామీణ భారతంఆత్మ గ్రామీణ మహిళల సాధికారతలో నివసిస్తుందని దానికి మరో వాక్యాన్ని జోడిస్తున్నానన్నారు అందుకే ఎన్డీయే ప్రభుత్వం మహిళల హక్కులకు, మహిళలకు కొత్త అవకాశాలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చిందని ప్రధాని గుర్తు చేశారు.

## అనంతలో పెట్రోల్ మోసం

అయినడియూ యూనిట్ ను ఓపెన్ చేయాలంటే ఓటీపీ అవసరం లేదు. 2023 సంవత్సరం తర్వాత తయారి అయిన డియూ యూనిట్ ఓపెన్ చేయాలంటే 22 అంకెలు గల ఓటీపీ వస్తుంది. అందులో 11 అంకెలు డీలర్ కు, 11 అంకెలు కంపెనీ టెక్నీషియన్ కు వస్తుంది. మొత్తం 22 అంకెలు ఎంటర్ చేస్తేనే మెషిన్ ఓపెన్ అవుతుంది. ప్రతి కంపెనీకీ జిల్లాకు ఒకరు లేదా ఇద్దరు టెక్నీషియన్లు ఉంటారు. వినియోగదారులు బాటిల్స్ లో కాని క్యాన్ లలో గాని పెట్రోల్ నింపమని అడిగినపుడు డిస్పెన్సరింగ్ యూనిట్ 2 ఆన్, ఆఫ్ రిమోట్ ద్వారా పనిచేసే మెకానిజం ద్వారా మెషిన్ ను కంట్రోల్ చేసి, సరైన కొలతలతో నింపుతారు. మిగతా వాహనాలు వచ్చినప్పుడు మాత్రం.. తక్కువ మొత్తంలో పెట్రోల్ పోస్తున్నారు. సాధారణంగా లీగల్ మెట్రాలాజి అధికారులు ప్రతి సంవత్సరం పెట్రోల్ పంపులను తనిఖీ చేసి సీలు వేయడం జరుగుతుంది. విజిలెన్స్ & ఎన్ఫోర్స్మెంట్ అధికారులు మరియు లీగల్ మెట్రాలాజి అధికారులు తనిఖీ నిమిత్తం వెళ్ళినప్పుడు లీగల్ మెట్రాలాజి వారు వేసిన సీళ్లు వేసినట్లుగానే వున్నాయి, కాని లోపల టాంపరింగ్ జరిగినట్లు అధికారులు గుర్తించారు. పెట్రోల్ డీజిల్ పంపులకు లోపల డీయూ ప్లైజర్ బోర్డులను ట్యాంపరింగ్ చేసి కొత్తగా ప్రోగ్రామింగ్ చేసిన చిప్ ను అమచినారు. ఇందులో టుఖేయిం కంపెనీకి చెందిన డిస్పెన్సివ్ యూనిట్ ను వాడుతున్నారు. మిషిన్ లో ఏర్పాటు చేసిన బోర్డులను ట్యాంపరింగ్ చేయడం వలన ఒక లీటర్ పెట్రోల్ డీజిల్ కు సుమారుగా 60 ఎం.ఎల్ నుంచి 100 ml తక్కువ వచ్చే విధంగా ప్రోగ్రాం లో అమర్చిన చిప్ పని చేస్తుంది. లీగల్ మెట్రాలజి సిబ్బంది వేసిన సిళ్ళు వేసిన తేది నుండి తనిఖీ చేసిన తేదికి పెట్రోల్ బంకులలో సరాసరి 25 లక్షల లీటర్ల డీజల్ / పెట్రోల్ పంపుల నుండి అమ్మకాలు జరుగగా, ఈ లెక్కన ఒక సంవత్సరానికి 2,50,000 లీటర్ల డీజల్ / పెట్రోల్ తక్కువగా వేసి దాదాపుగా రెండుకోట్ల యాభై లక్షల రూపాయల మేరకు వినియోగదారులను మోసగించినారు. ఇది ఒక పెట్రోల్ పంపు నుంచి మాత్రమే ఇంత స్థాయిలో ప్రజలు మోసపోనట్లు అధికారులు గుర్తించారు. సాధారణంగా డిజిల్/పెట్రోల్ వినియోగదారులు వాహనాలు బంకు వద్దకు రాగానే, చిప్ అమర్చిన DU వద్దకు వెళ్ళండి అని చేతులు ఊపి ఆ పంపు వైపునకు మళ్ళిస్తారనీ అధికారులు చెబుతున్నారు. ఈ ఘరానా మోసం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది.

# సృష్టికి ప్రతి సృష్టి చేసేదే మహిళ

- ప్రతి రంగంలో నేడు అగ్రగామి గా నిలుస్తుంది మహిళ
- ప్రపంచ మహిళా దినోత్సవ సందర్భంగా దేశ మహిళా సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన వేడుకలు

**జయభేరి,**






మార్చి 8 ఇది చరిత్ర గతిలో మరిచిపోలేని రోజు. ఎందుకంటే సమాజంలో స్త్రీలు వివక్షకు గురై మానప్రాణాలను త్యాగం చేసి స్వతంత్ర సంగ్రామంలో ఎన్నో నిరసన కార్యక్రమాలు జరిపి తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహించారు. అలాంటి మహిళలు లింగభేదంతో సమానత్వాన్ని కోల్పోయి, హక్కులను కోల్పోయి, వ్యవస్థలో దుర్భరమైన జీవితాన్ని గడిపారు. అలాంటి మహిళలు తమ పోరాట స్ఫూర్తిని రగిలించుకొని 1975లో అధికారికంగా ప్రపంచ మహిళా దినోత్సవాన్ని జరుపుకునేందుకు విశేష కృషిని జరిపారు. ఇక ఆ రోజు నుంచి వ్యవస్థలో లింగ సమానత్వం మహిళా సాధికారత మహిళా హక్కుల కోసం ఆర్థిక అసమానతలు తొలగించడానికి బలమైన పునాదిగా మహిళ దినోత్సవం ఏర్పాటు జరుపబడింది. మహిళా సాధికారత ద్వారా సామాజిక ఆర్థిక రాజకీయ ఆయా రంగాల్లో మహిళలను సగభాగం చేసేందుకు రాజ్యాంగం ద్వారా కూడా మహిళలకు ప్రథమ స్థానాన్ని కల్పించింది మన భారత ప్రభుత్వం.
స్త్రీలు ఈ వ్యవస్థలో బలమైన వారుగా గుర్తింపు నుంచి ఐక్యరాజ్యసమితి కూడా అధికారికంగా మహిళా దినోత్సవం గుర్తింపు తీసుకొచ్చింది. ఇక 2025 ఈ సంవత్సరానికి గాను ఒక నినాదాన్ని కూడా అందించింది... "చర్యను వేగవంతం చేయండి." దీని అర్థం మహిళా సాధికారత కోసం హక్కుల కోసం సామాజిక ఆర్థిక అసమానతలు తొలగించడానికి ఆ చర్యను వేగవంతం చేయాలని ఐక్యరాజ్యసమితి ఈ 2025 సంవత్సరానికి గాను ఒక నినాదాన్ని మహిళా సమాజానికి అందించింది.
ఈ నినాదాన్ని పుణికిపుచ్చుకొని దిశ మహిళా సేవా సమితి అనేక సంవత్సరాలుగా మహిళల సమస్యల కోసం పోరాడుతూ ఆర్థిక సామాజిక రాజకీయ కుటుంబ వ్యవహారాలలో ఉన్న సమస్యలను తొలగించడానికి శక్తికి మించి పోరాట ఉద్యమాన్ని నడిపిస్తుంది. దిశా మహిళా సేవా సమితి స్థాపించిన అధ్యక్షురాలు కే ఇందిరా కృపాకర్ కుటుంబ వ్యవస్థలో మహిళ బలమైన పునాదిగా ఏర్పడితే ఆ ఇల్లు పునర్నిర్మాణం జరుగుతుంది అనే నమ్మి మహిళ సంఘాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా వార్షిగుట్ట కాలనీలో మహిళలతో తమ సంతోషాన్ని పంచుకున్నారు దిశ మహిళా సేవా సమితి అధ్యక్షురాలు కే ఇందిరా కృపాకర్... ఈ సందర్భంగా దిశ మహిళా సేవా సమితి సభ్యులు.. కదారి నిర్మల, ఎం సంధ్య, ఏలే పద్మ, వి ఎస్ ఝాన్సీ, కె వసుంధర, యం,దీన, జి లావణ్య, రత్నకుమారి, జయమ్మ తదితరులు మహిళలు సంతోషంతో మహిళా దినోత్సవ సందర్భంగా కేకును కట్ చేసుకుని ఒకరికొకరు పంచుకొని సంతోషాన్ని వ్యక్తం చేశారు.



## నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

- విస్టా హోమ్స్ లో సీసీ కెమెరాల ప్రారంభం
- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, కాప్రా :**

నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని విస్టా హోమ్స్ లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని తెలిపారు. కీలకమైన కేసుల చేధనలో సీసీ కెమెరాల పాత్ర గణనీయంగా ఉందన్నారు. ఇటీవల కాలంలో సీసీ కెమెరాల వినియోగం భారీగా పెరిగిందన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కాలనీల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని కోరారు. మహిళ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో విస్టా హోమ్స్ కార్యవర్గం BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవం సందర్భంగా AMR planet నుండి జరిగిన 5K Ran లో ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ కార్యక్రమంలో మీర్ పేట హౌసింగ్ బోర్డు కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, BRS పార్టీ నాయకులు మహేష్ గౌడ్, అభయ ఫౌండేషన్ చైర్మెన్ ఉషా తదితరులు పాల్గొన్నారు.

**జయభేరి, కాప్రా**




## ఉచిత వైద్య శిబిరం

- RV ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం - మహిళలు & పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం వైద్య శిబిరం

**జయభేరి, మేడిపల్లి :**

మహిళలు, చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, తుంగతుర్తి రవి, RV ఫౌండేషన్ వ్యవస్థకులు & పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, బాలాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తంగా మిరాకిల్ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనుంది. ఈ వైద్య శిబిరం మార్చి 9, 2025 (ఆదివారం), ఉదయం 8:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు గణేష్ మండపం, స్ట్రీట్ నెం. 2, బాలాజీ నగర్ కాలనీ, పీర్జాదిగూడ లో జరుగుతుంది. ఈ కార్యక్రమంలో మహిళలకు, పిల్లలకు ఉచిత వైద్య సేవలు అందించబడతాయి. అనుభవజ్ఞులైన వైద్యులు, ఆరోగ్య నిపుణులు ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన సూచనలు అందిస్తారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ.."మహిళలు, పిల్లల ఆరోగ్యం పరిరక్షణ మా ప్రధాన లక్ష్యం. ఈ వైద్య శిబిరం ద్వారా పీర్జాదిగూడ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు మా RV ఫౌండేషన్ కట్టుబడి ఉంది. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాను" అన్నారు. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 040 22104104, 7440108108.

## ఏఎస్సై చిత్రహింసలకు యువకుడికి నరకం

**జయభేరి, భద్రాద్రి కొత్తగూడెం:**

అశ్వారావుపేట మండలంలోని నారంవారిగూడెం గ్రామానికి చెందిన కలపాల నాగరాజు అనే దళిత యువకుడిపై కోడిపుంజు దొంగతనం ఆరోపిస్తూ ఓ వ్యక్తి అశ్వారావుపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.ఫిర్యాదును స్వీకరించిన ఏఎస్సై రామ్మూర్తి విచారణ పేరుతో నాగరాజును స్టేషన్ కి పిలిపించి చిత్రహింసలకు గురిచేశాడు.కోడిపుంజు దొంగలించినట్టు ఒప్పుకోవాలని, నారంవారిగూడెం గ్రామ పరిసర ప్రాంతాల్లో ఏ దొంగతనం జరిగినా నువ్వే భాద్యుడిని అని ఒప్పుకుని అంగీకార పత్రం రాసి సంతకం పెట్టి ఇవ్వాలని భయభ్రాంతులకు గురిచేశాడు. విచారణలో భాగంగా సీన్ రిక్రియేషన్ పేరుతో పోలీస్ వ్యానులో దొంగతనం జరిగిన ప్రదేశానికి తీసుకువెళ్ళి ఫిర్యాడిదారుడి ముందే బాధిత యువకుడి జుట్టు పట్టుకుని చితకబాదాడు.యువకుడి భార్యను సైతం దొంగతనం కేసులో అరెస్టు చేస్తానని హెచ్చరించాడని బాధితుడి భార్య విలపించింది. మళ్ళీ స్టేషన్ కి తెచ్చి కరెంట్ షాక్ ఇచ్చి చిత్రహింసలకు గురిచేశారని బాధితుడు వాపోయాడు.తనను చిత్రహింసలకు గురిచేసిన వారిలో ఏఎస్సై రామ్మూర్తితో పాటు మరో ఇద్దరు కానిస్టేబుళ్లు ఉన్నారని బాధిత యువకుడు తెలిపాడు. ఏఎస్సై వూకే రామ్మూర్తి అవినీతి పరుడని,డబ్బు ఎరగా చూపించి గ్రామంలో కొందరు నాగరాజు పై థర్డ్ డిగ్రీ చేసేలా ప్రేరేపించారని దళిత సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.పోలీసులు విచక్షణా రహితంగా కొట్టడంతో బాధితుడు లేచి నిల్చునే స్థితిలో కూడా లేదని,రెక్కాడితే గానీ డొక్కాడని ఆ పేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.గతంలో సైతం ఇక్కడ ఎస్సైగా పని చేసిన రామ్మూర్తి అనేక మందిని ఇబ్బందులపాలు చేశాడని జిల్లా ఎస్పీ ప్రత్యేక విచారణ చేపట్టి సైకో ఏఎస్సై పై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## మహిళలే సంఘ నిర్మాతలు కావాలి

- ప్రతి రంగంలో మహిళలు పురుషులతో సమానంగా పోటీపడాలి
- కార్పొరేటర్ బన్నాల గీత
- చిల్కానగర్ లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

**జయభేరి, ఉప్పల్ :**




చిల్కానగర్ డివిజన్లోని బ్యాంక్ కాలనీలో చైల్డ్ వికాస్ ఫౌండేషన్ NGO ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ మాజీ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ పాల్గొన్నారు. అనంతరం మహిళా దినోత్సవ సందర్భంగా కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు అనంతరం వారు మాట్లాడుతూ.. మహిళా సాధికార తోనే ఏ రాష్ట్రమైనా దేశమైనా అభివృద్ధి చెందుతుందని మహిళలు పురుషులతో పోటీ పడుతూ అన్ని రంగాల్లో ముందుకు సాగాలని కొనియాడారు. జిహెచ్ఎంసి కార్పొరేషన్ లో 78 మంది కార్పొరేటర్లు మహిళలే ఉన్నారని, 14 మంది అడిషనల్ కమిషనర్లుగా మహిళలే ఉన్నారని, జిహెచ్ఎంసి పారిశుద్ధ్య కార్మికుల్లో 18 వేల మంది పైగా మహిళలే ఉన్నారని గుర్తు చేశారు. అనంతరం ఎన్జీవోలో పనిచేసే మహిళలకు శాలువాతో సత్కరించి మహిళలకు గిఫ్ట్స్ అందజేశారు.

## మహిళలను గౌరవించే దినోత్సవం
# మహిళా మణులకు సన్మానం

**జయభేరి, ఘట్కేసర్ :**




అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఘట్కేసర్ మున్సిపల్ పట్టణంలోని మహిళా మణులకు సన్మానం చేసిన ఘట్కేసర్ మున్సిపల్ మాజీ ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్.
ఈ సందర్భంగా మాజీ ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముందుగా ఘట్కేసర్ మునిసిపల్ లోని పోలీస్ అధికారులకు, వైద్య నిపుణులకు, స్వయం ఉపాధి మహిళా లకు మహిళా ఉపాధ్యాయులకు, వారు చేస్తున్న సేవలు గుర్తు చేస్తూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళల బలాన్ని, శక్తిని సూచిస్తుంది. వారిని గౌరవించే విధంగా ఉమెన్స్ డేకు శుభాకాంక్షలు తెలపండి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళలను గౌరవించే దినోత్సవం. ఒక మగవాడి విజయం వెనుక ఒక తల్లి, చెల్లి, అక్క, కూతురు... ఇలా ఎవరో ఒక స్త్రీమూర్తి ఉండే ఉంటారు. వారి త్యాగాలను గుర్తిస్తూ వారి శక్తిని రెండింతలు చేసేలా ప్రతి ఒక్కరూ సహకరించాలి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మీ జీవితంలో మీకు అండగా నిలిచిన మహిళలకు ఇలా శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో కీసర గుట్ట ఆలయ ధర్మ కర్త సగ్గు అనిత హిమకర్, సుశీల టీచర్, మాజీ కౌన్సిలర్ కడుపోలా మల్లేష్, మాజీ వార్డు సభ్యులు బర్ల దేవేందర్ ముదిరాజ్, మీసాల సుధాకర్, డీసీసీ కార్యదర్శి ఉల్లి ఆంజనేయులు యాదవ్, ఉపాధ్యక్షుడు కోరుబోతు నాగరాజు ముదిరాజ్, SC సెల్ అధ్యక్షులు శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు బొక్క సంజీవ్ రెడ్డి, నాయకులు కాయుమ్, రాజు, అనిల్, వైద్యులు, పోలీస్ అధికారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మెగా హెల్త్ క్యాంపు నీ ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే



**జయభేరి, కాప్రా :**

చర్లపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్ ఫేస్ 3 ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంపు నీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. RR హాస్పిటల్ వారి సౌజన్యంతో మెగా హెల్త్ క్యాంపు నీ ఏర్పాటు చేసిన ఫేస్ 3 ఇండస్ట్రియల్ వాళ్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ ప్రెసిడెంట్ సుధీర్ రెడ్డి, చైర్మెన్ రూషి రెడ్డి, గోపాల్, గోవింద్ రెడ్డి, ప్రెసిడెంట్ మియ్యపురం రమేశ్, సునీల్, వైస్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్, బబ్బర్ ఆలీ, సతీష్ BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళల దినోత్సవం వేడుకలు

- మహిళలే ఈ సృష్టికి మూలం



**జయభేరి, ఉప్పల్ :**

హబ్సీగూడ BRS పార్టీ ఆధ్వర్యంలో SVM గ్రాండ్ రామంతపూర్ లో జరిగిన మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా దినోత్సవం సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని మహిళ సోదరీమణులు అందరికి శుభాకాంక్షలు తెలిపారు. స్త్రీలు అన్ని రంగాల్లో రాణించాలని, విద్యార్థినులు ఇష్టంతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను చేరుకుంటారని అన్నారు.డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చాలా గొప్ప పనిచేశారని, భారత రాజ్యాంగంలో మహిళలకు సమాన హక్కులు కల్పించారని అన్నారు.మహిళలందరూ పురుషులతో పోటీ పడుతూ అన్నిరంగాలలో ముందుకు సాగాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్ గిరి పార్లమెంట్ BRS పార్టీ ఇంఛార్జి రాగిడి లక్ష్మారెడ్డి, BRS పార్టీ రాష్ట్ర నాయకులు పసుల ప్రభాకర్ రెడ్డి, మాజీ డివిజన్ అధ్యక్షులు Dr చారి , మాజీ ప్రధాన కార్యదర్శి సోమిరెడ్డి, లక్ష్మి నారాయణ, కైలాష్ పాతి గౌడ్, యాదయ్య, మహిళ సోదరీమణులు సరిత గౌడ్, మాజీ అధ్యక్షురాలు యాదమ్మ, రజిత రెడ్డి, కల్పన రెడ్డి, లక్ష్మి, BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## 25వ డివిజన్ లో ఘనంగా
# మహిళ దినోత్సవ వేడుకలు

- మహిళలను ఘనంగా సన్మానించి గౌరవించిన మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి
- 5సంవత్సరాలుగా 25వ డివిజన్ లో పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బందిని సన్మానించి బహుమతులు అందించారు
- మహిళలందరికి క్రీడా పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు

**జయభేరి, మేడిపల్లి :**



అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా పీర్జాదిగుడా మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్ లో మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో 250 మంది మహిళలతో అంగరంగ వైభవంగా క్రీడలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని విజేతలుగా నిలిచారు. అనంతరం మహిళలు అందరూ ప్రేమతో సహబంతి భోజనం చేశారు, తర్వాత మహిళ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మహిళలు తమ తమ ప్రసంగాన్ని వినిపించారు. తదనంతరం కేక్ కట్ చెసి శుభాకాంక్షలు తెలుపుకొని, క్రీడల్లో విజేతలకు మెమోంటో అందించి, వచ్చిన ప్రతి మహిళ సోదరీమణులందరిని కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి శాలువతో మర్యాదపూర్వకంగా సన్మానించి గౌరవించుకున్నారు. మహిళలు అందరూ కలిసి మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డిని సన్మానించారు. మహిళా దినోత్సవం సందర్భంగా 25వ డివిజన్ లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికురాళ్లను ఘనంగా సన్మానించిన బహుమతులను అందించారు. ఈ యొక్క కార్యక్రమంలో పీర్జాదిగుడా 25వ డివిజన్ లోని విహరిక, శ్రీ సాయి నగర్, సాయి హిల్స్, క్రాంతి కాలనీల మహిళలు, కాలనీల అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



## విద్యుత్ షాక్ తో రైతు మృతి

**జయభేరి, చేవెళ్ల:**

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజవర్గం శంకర్ పల్లి మండల పరిధిలోని టంగటూరు గ్రామంలో కరెంట్ షాక్ తో బద్దం శంబారెడ్డి మృతి చెందాడు. ఇది హత్య చేసి ఉంటారా లేక కరెంట్ షాక్ తో మృతి చెందాడని పలు విమర్శలు వినిపిస్తున్నాయి. కుటుంబ సభ్యులకు ఇన్ఫర్మేషన్ లేకుండానే స్థానిక చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టుగా కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

- మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి - మాజి సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి

**జయభేరి, మర్చి 8:**

శామీర్ పేట్ మండలం అలియాబాద్ గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ కమటం కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఉన్న మహిళలు ఉన్నత రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్, బిల్ కలెక్టర్ కల్పన, బండి రామ్ రెడ్డి, రాము స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## న్యూ లిటిల్ లిల్లీ పాఠశాలలో ఘనంగా క్రీడా దినోత్సవం

- మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి - జేజే శోభ



**జయభేరి, మర్చి 8:**

నేటి తరం విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని, ఇటు చదువుతో పాటు అటు క్రీడలపై ప్రావీణ్యం సంపాదించాలని అర్జున అవార్డు గ్రహిత, ఓలంపియన్ క్రీడాకారిని జేజే.శోభ అన్నారు. మేడ్చల్ పట్టణంలోని న్యూ లిటిల్ లిల్లీ హై స్కూల్‌లో చైర్ పర్సన్ మంజూల ప్రకాశ్ ఆధ్వర్యంలో శనివారం క్రీడా దినోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులుగా ఎదగాలంటే కృషి పట్టుదల కావాలన్నారు. విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. అయితే మహిళలు నేటి రోజుల్లో అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ప్రస్తుత రోజుల్లో కూడా కొంతమంది తాము మగవారి కంటే తక్కువగా ఊహించుకుంటున్నారని ఇందులో ఎంతమాత్రం నిజం లేదన్నారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి తమ లక్ష్యాలను సాధించుకోవాలని హితువు పలికారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న సూక్తికి నిదర్శనంగా ఇచ్చిన ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జాతీయ ఖోఖో క్రీడాకారుడు వినోద్, న్యూలిటిల్ లిల్లీ హై స్కూల్ చైర్ పర్సన్ మంజులప్రకాశ్, డైరెక్టర్లు సాయిదీప్, మౌనిక, ప్రిన్సిపాల్ శాంతి, పీఈటీలు దుర్గాప్రసాద్, లావణ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

- కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న మహిళలు
- కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేస్తుంది - శివ చరణ్ రెడ్డి



**జయభేరి, మర్చి 8:**

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అన్ని రకాలుగా ప్రోత్సాహకాలను అందించేస్తుందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం అలియాబాద్ గ్రామంలో శామీర్‌పేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి శ్రీఖర్ రెడ్డి అధ్యక్షతన శక్తి అవార్డు సెరోమనీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించి మహిళ సాధికారత సాధించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ స్ఫూర్తి తో 6 గ్యారంటీలు మహిళలకే కేటాయించారని తెలిపారు. ఇందిరా గాంధీని స్ఫూర్తి గా తీసుకుని మహిళకు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో ఎదగాలని కోరారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ పొన్నం తరుణ్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు బొమ్మక్ అజయ్, ఏ బ్లాక్ అధ్యక్షురాలు కోమలత, అసెంబ్లీ అధ్యక్షుడు టి.రాహుల్ యాదవ్, ఉపాధ్యక్షుడు బి. సాయి కిషోర్, మహిళా ఉపాధ్యక్షురాలు సుజాత, గ్రామ అధ్యక్షురాలు రేవతి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి రాహుల్ యాదవ్, స్టేట్ యూత్ కాంగ్రెస్ సెక్రటరీ సురేష్, మండల్ యూత్ ప్రెసిడెంట్ బండి శ్రీఖర్ రెడ్డి, అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ టి.రాము, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీవో) అధ్యక్షురాలు దాసరి రుణాదేవి టీఎన్జీవో ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మహిళా ఉద్యోగులకు ఘనంగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఇకముందు కూడా ఇదే స్ఫూర్తి ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలని అన్నారు. చదువుతోనే మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎస్ మధు, ట్రెజరర్ ఎస్ నాగరాజు, కార్యవర్గ సభ్యులు యూనిట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కోట్లు దండుకున్నారు సరిపోలేదా..!

- మళ్లీ ధర్నాల పేరిట ఇకేం చేస్తారు
- నీతి మాలిన రాజకీయాలు మానుకో
- మీ అద్భుతమైన టౌన్ షిప్ లో స్మశాన వాటిక, కబస్తాన్ కట్టలేకపోయారు
- సర్వం కోల్పోయిన త్యాగధనులతో రాజకీయాలు సిగ్గుచేటు
- నీకు దమ్ముంటే కేసీఆర్ ను బయటకు రమ్మను
- రవాణ, ఇతర సహాయం పేరిట మంజూరైన నిధులు ఏమయ్యాయి



**జయభేరి, గజ్వేల్, మర్చి 08 :**

బిఆర్ఎస్ నేత ప్రతాప్ రెడ్డికి గజ్వేల్ ప్రజలు మూడు సార్లు బుద్ధి చెప్పినా సిగ్గు తెచ్చుకోకుండా నీతిమాలిన రాజకీయాలు చేస్తున్నట్లు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింహారెడ్డి విమర్శించారు. శనివారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సర్వం కోల్పోయిన ఆర్అండ్ఆర్ కాలనీ బాధితులలో కలిసి వారు మాట్లాడారు. మల్లన్న సాగర్ నిర్మాణం పేరిట ఏడు గ్రామాల ప్రజలను కెసిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, వారి తాబేదార్ ప్రతాప్ రెడ్డి నిలువునా మోసం చేసి అనుచరులకు నిబంధనలకు విరుద్ధంగా వందల ప్లాట్లు, రూ కోట్ల నగదు దోచుపెట్టినట్లు విమర్శించారు. కెసిఆర్ క్యాంపు కార్యాలయంలో స్వయంగా మాజీ మంత్రి హరీష్ రావు ప్రతి ఇంటికి రవాణ, ఇతర ఖర్చుల కింద రూ 50 వేలు ఇచ్చినట్లు ప్రకటించగా, మరి ఆ నిధులు ఏమయ్యాయని, ఎవరికి దోచిపెట్టారని నిలదీశారు. ముఖ్యంగా నిర్వాసిత గ్రామాలలో బాధితులకు తీవ్ర అన్యాయం చేసిన బిఆర్ఎస్ నేతలు అక్రమంగా స్థలాలు కబ్జా చేసినట్లు ఆరోపించారు. కనీసం గుడి, బడి, స్మశాన వాటిక, కబ్రిస్తాన్ లకు సైతం స్థలాలు మిగలకుండా కాజేసిన నీ అనుచరులను ముందు నిలదీయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ అండతోనే అవినీతి, అక్రమాలకు పాల్పడగా, నిలదీసిన పలువురిని హత్య చేసేందుకు సైతం కుట్రలు పన్నిన విషయాన్ని వారు గుర్తు చేశారు. అంతేకాకుండా గజ్వేల్ ఇందిరా పార్క్ నుండి కోట మైసమ్మ వరకు రోడ్డు విస్తరణలోని బాధితులను ఆదుకుంటామని హామీ ఇవ్వగా, అధికారం కోల్పోయాక కల్లబొల్లి మాటలతో బాధిత కుటుంబాలను రెచ్చగొట్టడం సిగ్గుచేటని నిలదీశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు ఇండ్ల పంపిణీ పేరిట రాజకీయం చేసిన ప్రతాప్ రెడ్డి మరి వారికి ఇండ్లు ఎందుకు అప్పగించలేదని ప్రశ్నించారు. లాటరీ పద్ధతిన లబ్ధిదారులను గుర్తించిన అధికారులను తప్పుదోవ పట్టిస్తూ ప్రతాపరెడ్డి కొంతమంది కౌన్సిలర్ల అండతో ఆ లిస్టును తొక్కి పెట్టి మున్సిపల్ లో రాజకీయం చేసింది ఇంకా గజ్వేల్ ప్రజలు మర్చిపోలేదని అన్నారు. పదేళ్లపాటు కేసీఆర్ హరీష్ రావులతో అంటగాగిన ప్రతాపరెడ్డి ప్రస్తుతం ఆ నెపాన్ని కాంగ్రెస్ పై నెట్టడం ఆయన నీతిమాలిన రాజకీయాలకు అద్దం పడుతుందని విమర్శించారు. అయితే స్థానిక ఎమ్మెల్యే కెసిఆర్ కాకుండా ప్రతాప్ రెడ్డి మాట్లాడడం తగదని, దమ్ముంటే కేసీఆర్ ను బయటకు లాగాలని, సెక్రటేరియట్ కాకుండా ముందు కాకుండా కేసీఆర్ ఫాం హౌజ్ ముందు ధర్నా చేయాలని డిమాండ్ చేశారు. నిర్వాసిత గ్రామాల ప్రజలు, మున్సిపల్ పరిధిలోని పేదలు ప్రతాప్ రెడ్డికి తగిన బుద్ధి చెప్పడం ఖాయమని వివరించారు. ఈ కార్యక్రమంలో సుఖేందర్ రెడ్డి ఏఎంసి డైరెక్టర్లు కరుణాకర్ రెడ్డి యాదయ్య మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్ నాయకులు కుట్ల లక్ష్మారెడ్డి నక్క రాముడు గౌడ్ అంజి యాదవ్ ఉడెం శ్రీనివాస్ రెడ్డి జూపల్లి లక్ష్మన్ జహీర్ జహగిర్ దప్పు గణేష్ అందిపూర్ బలగౌడ్ దయల యాదగిరి శ్రవణ్ అరుణ్ ఆర్ అండ్ ఆర్ కాలనీ నాయకులు ఉపేందర్ ప్రమోద్ పిట్ల శ్రీను రాములు సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహిళా పారిశుద్ధకార్మికులకు సన్మానం

- మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్య లక్ష్యం అడ్డగూడూర్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బైరెడ్డి సందీప్ రెడ్డి
- టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు పూలపెల్లి సోమిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి రమేష్



**జయభేరి, అడ్డగూడూరు :**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తుంగతుర్తి నియోజకవర్గంలోని అడ్డగూడూరు మండల కేంద్రంలో గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికులుగా సేవలందిస్తున్న మహిళలను యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ అడ్డగూడూర్ మండల అధ్యక్షులు బైరెడ్డి సందీప్ రెడ్డి, తుంగతుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షులు కప్పల రాజేష్, సూర్యాపేట జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారిసెట్టి మల్లేష్ కలిసి ఉమ్మడిగా మాట్లాడుతూ సాధికారత, లింగ సమానత్వం సాధించే దిశగా ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నింటిలోనూ మహిళలకే ప్రథమ ప్రాధాన్యతనిస్తోందని గుర్తుచేశారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నట్టు పేర్కొన్నారు. సృష్టికి మూలం, జగతికి ఆధారం, అలుపెరగని శ్రమతత్వంతో పనిచేస్తున్న నారీశక్తి, ఆమె లేనిదే సృష్టి లేదు, ఆమె లేనిదే గమనం లేదు, మన పుట్టుకకు, ఉనికికి మూలమైన మహిళలను గౌరవిద్దాం. అన్ని రంగాల్లో దూసుకుపోతున్న మహిళలకు మన వంతుగా ఊతమిద్దాం. సమాజ శ్రేయస్సులో భాగస్వామ్యం అవుతున్న మహిళ మూర్తులను మహిళా దినోత్సవం రోజు సన్మానించుకోవడం సంతోషకరంగా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అడ్డగూడూర్ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు పూల పెల్లి సోమిరెడ్డి, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి రమేష్, అడ్డగూడూరు మండల బీసీ సెల్ అధ్యక్షులు నాగులపల్లి రమేష్, జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు బైరెడ్డి అనంతరెడ్డి, కాంగ్రెస్ నాయకులు తుప్పతి మధు అడ్డగూడూరు మండల యువజన కాంగ్రెస్ నాయకులు గండేల రవి, చిన్నం తిరు మలేష్ గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు




## క్రీడలపై దృష్టి సారించాలి

- అర్జున అవార్డు గ్రహిత, ఓలంపియన్ క్రీడాకారిని జేజే.శోభ
- న్యూ లిటిల్ లిల్లీ హై స్కూల్‌లో అట్టహాసంగా స్పోర్ట్స్ డే

**జయభేరి, మేడ్చల్ :**

విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని అర్జున అవార్డు గ్రహిత, ఓలంపియన్ క్రీడాకారిని జేజే.శోభ అన్నారు. మేడ్చల్ పట్టణంలోని న్యూ లిటిల్ లిల్లీ హై స్కూల్‌లో చైర్ పర్సన్ మంజూల ప్రకాశ్ ఆధ్వర్యంలో శనివారం క్రీడా దినోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులుగా ఎదగాలంటే కృషి పట్టుదల అవసరం అన్నారు. విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే తప్పకుండా ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. మహిళలు ప్రస్తుతం అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగి తమ లక్ష్యాలను సాధించుకోవాలని హితువు పలికారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యమే మహాభాగ్యం అన్న సూక్తికి నిదర్శనంగా ఇచ్చిన ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో న్యూ లిటిల్ లిల్లీ హై స్కూల్ చైర్ పర్సన్ మంజూలప్రకాశ్, జాతీయ ఖోఖో క్రీడాకారుడు వినోద్, డైరెక్టర్లు సాయిదీప్, మౌనిక, ప్రిన్సిపాల్ శాంతి, పీఈటీలు దుర్గాప్రసాద్, లావణ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# డివిజన్ లో మార్నింగ్ వాక్

- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

**జయభేరి, హయత్ నగర్ :**



హయత్ నగర్ డివిజన్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి నేడు మార్నింగ్ వాక్ కార్యక్రమం లో భాగంగా కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు డివిజన్ లోని విద్య నగర్ కాలనీలో పర్యటించి కాలనీ వాసుల సమస్యలు తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కాలనీ వాసులు ముందుగా అడిగిన వెంటనే నూతన స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేయించిన కార్పొరేటర్ కి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలపడం జరిగింది. అదేవిధంగా కాలనీలోనీ ఓ వీధిలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల సదుపాయం లేకపోవడంతో కాలనీవాసులు అవస్థలు పడుతున్నారని కార్పొరేటర్ కి సమస్యను వివరించారు. కాలనీవాసుల సమస్యలు తెలుసుకున్న కార్పొరేటర్ GHMC లో నిధుల కొరత వద్ద అభివృద్ధి పనుల్లో కొంత ఆలస్యం జరుగుతుందని, విద్య కాలనీ పూర్తి స్థాయి లో అభివృద్ధి పరిచేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానని కాలనీవాసులకి హామీ ఇవ్వడం జరిగింది. ఈ పర్యటనలో కాలనీ అధ్యక్షులు రామ రావు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు రామ్ రెడ్డి, పోతులూరి, నర్సింహా, బిక్షపతి, నాగరాజు, లక్ష్మణ్, చారి, సత్తయ్య, కృష్ణ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## యత్ర నార్యస్తు పూజ్యంతే రమన్తే తత్ర దేవతాః



**జయభేరి, దేవరకొండ :**

ఎక్కడ స్త్రీలు గౌరవింపబడతారో, ఎక్కడ స్త్రీలను దేవతగా భావించి పూజిస్తారో, అక్కడ సర్వసంపదలూ ఉండడమేకాక రథ, గజ, తురగ పదాదులతో కూడిన లక్ష్మీ దేవి అచంచలయై నిలబడుతుంది అని నమ్ముతూ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఎమ్మెల్యే నలమాద పద్మావతి కి, నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కి శాలువాతో సన్మానం చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల సాధికారితకు ఎంతో ప్రాధాన్యత ఇస్తూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా అన్ని రంగాల్లో మహిళలను ప్రోత్సహిస్తూ మహిళ సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం పని చేస్తుంది అని అన్నారు.

# పరిశుద్ధ కార్మికులను సన్మానించిన కార్పొరేటర్ కళ్లెం

**జయభేరి, హయత్ నగర్ :**



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి డివిజన్లోని సుభద్ర నగర్ కాలనీ వాసులు కాలనీ సంక్షేమ సంఘం భవనం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేవలం ఒక్కరోజే కాకుండా యేడాదిలో 365రోజులు మహిళలను గౌరవిస్తే మహిళలపై గౌరవం పెరిగి అత్యాచారాలు తగ్గుతాయని అన్నారు. ప్రధాని మోది మహిళలకు గౌరవం ఇస్తూ సుకన్యా సంవృద్ధి యోజనా కార్యక్రమాన్ని తీసుకొచ్చారు. అంతే కాకుండా ముస్లీం మహిళపై త్రిపుల్ తలాక్ పేరుతో జరుగుతున్న అన్యాయాన్నికి గురయ్యారని, త్రిపుల్ తలాక్‌ను రద్దు చేసి వారికి గౌరవాన్ని కల్పించారు.

ప్రభుత్వం మహిళలకు 50శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారని, గొప్ప గొప్పమహిళలు అనేక రంగాలలో ఉన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో మార్పు తీసుకురావాలని, రాజకీయ పరంగా, వ్యాపార పరంగా ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుభద్ర నగర్ కాలనీ అధ్యక్షులు లక్ష్మణ స్వామి, సీనియర్ సిటిజన్ KSL మూర్తి, బిజెపి డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవింద చారి, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు హర గోపాల్, ESR మూర్తి, సుబ్బలక్ష్మి, నిర్మల, సుభద్ర, ఫణి కుమార్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తు అంతా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ దే

**జయభేరి, హైదరాబాద్:**

అన్ని రంగాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాధాన్యత నానాటికి పెరుగుతుందని భవిష్యత్తు మొత్తం ఏఐదేనని భారత్ లైట్ హౌస్ సీఈవో మోహన్ కుమార్ అన్నారు. ఏఐపై విద్యార్థులు యువతకు అవగాహన కల్పించే నిమిత్తం ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా హైటెక్ సిటీ లోని ట్రై డెంట్ హోటల్లో ఏఐ గవర్నెన్స్ సమ్మిట్ ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని బీసీ దళ్ అధ్యక్షుడు కుమారస్వామి ముఖ్యఅతిథిగా హాజరై జెనసిస్ సీఈఓ వినయ్ కుమార్, దీప్తి లతో కలిసి ఆవిష్కరించారు. ఏఐతో ఉద్యోగాలు పోతాయి అన్న ఆందోళన విడి యువత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పై నైపుణ్యాలు సాధించాలని అన్నారు.

## పెన్షనర్స్ సేవాసదనంలో మహిళా దినోత్సవం వేడుకలు

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పెన్షనర్స్ సేవాసదనం నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వృత్తిపరంగా సేవాభావం కలిగిన మహిళామనులను పూలమాల, శాలువ, మెమంటోలతో సత్కారం చేయడం జరిగినది. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు తాడిశెట్టి నరసింహ, అంకం చంద్రమౌళి మాట్లాడుతూ ఈ సమాజం, కుటుంబం మంచిగా వుండాలంటే మహిళా మణుల వల్లనే సాధ్యమవుతుంది అన్నారు. సత్కారం పొందిన వారు మాట్లాడుతూ సమాజం పట్ల మాబాధ్యత పెరిగింది అన్నారు. సంతోషం వ్యక్తం చేసినారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి పంగునూరు లింగయ్య, అసోసియేట్ అధ్యక్షులు గంగిడి దామోదర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కంచర్ల నారాయణ రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ షరీఫ్, కార్యవర్గం, కార్యవర్గం సభ్యులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సిఐటియు ఆధ్వర్యంలో శ్రామిక అంతర్జాతీయ మహిళా దినోత్సవం

- సమాన పనికి సమాన వేతన చట్టం అమలు చేయాలి
- పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలి
- కార్మిక వ్యతిరేక కోడులు రద్దు చేయాలి
- అంబేద్కర్ చౌరస్తాలో ప్లే కార్డులతో ప్రదర్శన
- సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య

జయభేరి, గజ్వేల్, మర్చి 08 :

మహిళలందరికీ సమాన పనికి సమాన వేతన చట్టం అమలు చేయాలని, కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడలు రద్దు చేయాలని, పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సంద బోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా గజ్వేల్ పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో ప్లే కార్డులతో మహిళా దినోత్సవం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు మొదట ఓటు హక్కు కోసం, పని గంటలు తగ్గించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని లింగ వివక్ష ను పోరాటం నిర్వహించారని తెలిపారు జర్మన్ సోషలిస్టు నాయకురాలు క్లారా జెట్కిన్ ఆధ్వర్యంలో 1910 లో డెన్మార్క్ లో జరిగిన అంతర్జాతీయ సోషలిస్టు మహిళా మహాసభల్లో ప్రపంచవ్యాప్తంగా మహిళా దినోత్సవాలు జరపాలని నిర్ణయించడం జరిగిందని అన్నారు 1921 రష్యాలో జరిగిన కమ్యూనిస్టు మహిళా మహాసభల్లో మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినోత్సవం గా జరపాలని తీర్మానించడం జరిగిందని అన్నారు 1977లో ఐక్యరాజ్యసమితిలో తీర్మానం చేశారని ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా ఉత్సవాలు జరుగుతున్నాయని అన్నారు మహిళా దినోత్సవం అంటే ఒకరోజు గౌరవించడం కాదని, కుటుంబంలో వివక్ష లేకుండా పెంచడం, సమానత్వ అవకాశాలు కల్పించడం, మహిళల సామాజిక అంచివేతకు వ్యతిరేకంగా పోరాటం అని అన్నారు. పురుషులు పని ప్రదేశాల్లో మాత్రం చేస్తున్నారని, మహిళలు పని ప్రదేశాలతో పాటు,గృహ అవసరాలతో పాటు పిల్లల బాధ్యత అదనంగా చారిత్రకంగా ఉందని అన్నారు.

ప్రారంభంలో పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు 16, 18 గంటలు పని ఉన్న కారణంతో పని గంటలు తగ్గించాలని, ఆరోగ్య సమస్యలు, ప్రసూతి సెలవులు, సమాన వేతనాలు ఇవ్వాలని పోరాటాలు నిర్వహించడం జరిగిందని అన్నారు ప్రస్తుత పరిస్థితుల్లో భారత దేశంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక కోడుల అమలుకు ప్రయత్నం చేస్తుందని అన్నారు గతంలో ఉన్నటువంటి చట్టాలను రద్దుచేసి కార్మిక సంక్షేమ పథకాలు యజమానులకు అనుకూలంగా మారుస్తుందని 14 గంటల పని విధానం, ఈ ఎస్ ఐ, పి ఎఫ్, మహిళల ప్రసూతి సెలవులు, సంక్షేమ పథకాలు కోల్పోయే ప్రమాదం ఉందని వృత్తి పరమైన భద్రత ఆరోగ్యము పని పరిస్థితుల కార్మిక కోడులో(2020) వివరించడం జరిగిందని అన్నారు. మహిళలపై పని ప్రదేశాల్లో దాడులు పెరిగాయని రక్షణ లేకుండా పోయిందని, పని ప్రదేశాల్లో మహిళల భద్రత కమిటీలు వేయాలని చట్టం తెలిపిన ఇక్కడ అమలుకు నోచుకోవడం లేదని అన్నారు మహిళలను సరుకుగా చూసే సంస్కృతి రోజు రోజు పెరుగుతుందని దీనిని నియంత్రించాలని అన్నారు.ఆధునిక మీడియా సాంకేతిక పరిజ్ఞానం అశ్లీల భావజాలాన్ని సమాజంలోకి వదులుతున్నారని అన్నారు యువత,కుటుంబాలు తప్పుదారి పడుతున్నాయని అన్నారు.అశ్లీల దృశ్యాల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. సామాజిక అణిచివేతకు, ఆర్థిక దోపిడీకి, కార్మిక కోడులకు,అశ్లీల సాహిత్యానికి వ్యతిరేకంగా అందరూ కలిసి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి, జిల్లా కమిటీ సభ్యులు మరాఠీ కృష్ణమూర్తి, ఆర్ పి సంఘం జిల్లా కార్యదర్శి సుభద్ర, కల్పన,మనోహరి, సుధారాణి,ఫాతిమా, సంధ్యారాణి, పావని, మసూద్ ఉన్నిసా, వరకుమారి, భవాని, కృష్ణలీల, బాలమణి, జ్యోతి రజిని రాణి తదితరులు పాల్గొన్నారు.






## ఊరంతా వాసన.. పట్టించుకోని అధికారులు

- జబ్బపూర్ గ్రామ శివారులో పడేసిన వందల కొద్దీ చనిపోయిన కోళ్లు

జయభేరి, వర్గల్, మర్చి 08 :

చనిపోయిన వందల కొద్ది కోళ్ల వాసనతో భరించలేకపోతున్నామని గ్రామస్థులు తెలిపారు.ఈ ఘటన వర్గల్ మండలం జబ్బపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం జబ్బపుర్ గ్రామ శివారులోని డాంపు యార్డ్ దగ్గర లో చనిపోయిన వందల కొద్దీ కోళ్లను పడివేశారని ఆ దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని జబ్బపూర్ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా అధికారులకు చెప్పిన ఫలితం లేదన్నారు. కోళ్ల ఫారంలో ఎక్కడో చనిపోతే జబ్బాపూర్ గ్రామ శివారులో పడి వేయడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి వాటిని వెంటనే తొలగించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

## ప్రత్యేక పూజలో పాల్గొన్న మ్యాకల కనకయ్య దంపతులు

- సుదర్శన చక్రానికి అభిషేకం దంపతులు



జయభేరి, మార్కుక్, మర్చి 08 :

మార్కుక్ మండల పరిధిలోని పాములపార్తి గ్రామంలోని సీతారామాంజనేయ స్వామి దేవాలయ వార్షికోత్సవంలో భాగంగా ఆలయ గోపురంపై సుదర్శన చక్రం ప్రతిష్టిస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఆలయ కమిటీ, మండల బిఆర్ఎస్ బీసీసెల్ అధ్యక్షులు జిల్లా ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు మ్యాకల కనుకయ్య చంద్రకళ దంపతులు సుదర్శన చక్రానికి ప్రత్యేక పూజలు అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## విజయవాడకు పోసాని తరలింపు

జయభేరి, విజయవాడ:

సినీ నటుడు పోసాని కృష్ణమురళిని పోలీసులు కర్నూలు జైలు నుంచి విజయవాడకు తరలించారు. పీటీ వారెంట్ పై ఆయనను తీసుకువచ్చారు. విజయవాడలోని భవానీపురం పీఎస్లో పోసానిపై కేసు నమోదైంది. పీటీ వారెంట్ పై ఆయనను తీసుకువచ్చేందుకు విజయవాడ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు అనుమతించింది. దీంతో పోలీసులు కర్నూలు నుంచి ఆయనను విజయవాడకు తరలించారు.

## మహిళా నీ శక్తి వర్ణించలేనిదమ్మ

- సృష్టికి మూలమే స్త్రీమూర్తులు
- సమాజంలో మార్పు కొరకు మహిళా మూర్తుల పాత్ర అత్యంత కీలకం
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మాజీ కౌన్సిలర్లకు సన్మానం చేస్తున్న మాజీ ఎఫ్డీసీ



జయభేరి, గజ్వేల్, మర్చి 08 :

మహిళ శక్తి చాలా గొప్పదని వారు అనుకుంటే సాధించలేనిది ఏదీ లేదని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జి ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గజ్వేల్ లోని క్యాంపు కార్యాలయంలో గజ్వేల్ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ మాజీ మహిళా కౌన్సిలర్లకు అదే విధంగా బీఆర్ఎస్ మహిళా నాయకురాలకు ఘనంగా సత్కరించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ సృష్టికి మూలమైన స్త్రీమూర్తులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు బాగుంటేనే ఆ కుటుంబం, రాష్ట్రం, దేశం బాగుంటుందని తెలిపారు. ఎక్కడ స్త్రీలు పూజిం చబడుతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని తెలిపారు. సమాజంలో మార్పు తీసుకురావాలంటే మహిళా మూర్తుల పాత్ర అత్యంత కీలకమన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తు పురుషులకు దీటుగా ముం దుకు వెళ్తున్నారని అన్నారు. మహిళలు తమ జీవి తాల్లో మరింత ముందుకెళ్లాలని, భయాన్ని వీడి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని మనస్పూర్తిగా కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ము న్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, గజ్వేల్ మాజీ మా ర్కెట్ కమిటీ చైర్మన్లు మాదాసు అన్నపూర్ణ శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఖాజా విరాసత్ అలీ, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీ, కౌన్సిలర్లు వంటేరు ఉమాగోపాల్ రెడ్డి, ఉప్పల మెట్టయ్య, బబ్బూరి రజిత, తలకొక్కుల భాగ్యలక్ష్మి దుర్గాప్రసాద్, గుంటుకు శిరీషరాజు, మరికంటి వరలక్ష్మి కనకయ్య, పంబాల అర్చన శివ, బాలమణి శ్రీనివాస్ రెడ్డి, అత్తిలి మాధవి శ్రీనివాస్,చీర్ల శ్యామల మల్లేశం, మామిడి విద్యారాణి శ్రీధర్, బొగ్గుల చందు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అరుణ భూపాల్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు మంజులా రెడ్డి, సునీత, ఎస్ఆర్ఈజీఎస్ కౌన్సిల్ మెంబర్ కోల సద్గుణ, అల్వాల బాలేష్, కో ఆప్షన్ సభ్యులు ఉమర్, అహ్మద్, ఫర్జానా,

## అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

జయభేరి, గజ్వేల్, మర్చి 08 :



గజ్వేల్ మండలం కోడకండ్ల గ్రామంలో అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఓటింగ్ పద్ధతి ద్వారా ఎన్నుకోవడం నూతన అంబేద్కర్ సంఘం అధ్యక్షులు అరిగే ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి ముంద్రాతి వంశీ, గౌరవ అధ్యక్షులు కోడిశాల ప్రశాంత్ ఈ సందర్భంగా, నాయకులు మాట్లాడుతూ మహనీయులు కలలుగన్న సమ సమాజ స్థాపన కోసం మా వంతు కృషి చేస్తామని తెలియజేశారు. మహనీయుల ఆలోచనలను, ఆశలను బహుజన ప్రజలలోకి తీసుకెళ్తాం అని అన్నారు.అంబేద్కర్ సంఘం పార్టీలకు,కులాలకు, మతాలకు అతీతంగా పని చేస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో తాజా మాజీ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు చంద ప్రవీణ్ కుమార్, తాజా మాజీ ఎంపీటీసీ అరిగే అశోక్ కుమార్,మాజీ సర్పంచ్ ఎడ్ల భూమయ్య,ముంద్రాతి రాజు,కొడిత్యాల భాస్కర్,ఎడ్ల రవి,గజ్వేల్ శైలేష్,ముంద్రాతి కృష్ణ , కనకయ్య, నాగరాజు, రవికుమార్, ప్రవీణ్, గిరిబాబు, గణేష్, ముఖేష్, శివప్రసాద్, బాలచందర్, రవికుమార్, నరేష్ కుమార్, నర్సింలు, శేఖర్, కరుణాకర్, విలాస్ కుమార్, ప్రశాంత్, వంశీ, భాను కుమార్, మనోజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ సంఘం నూతన కమిటీ సభ్యులుగా అధ్యక్షులు అరిగే ప్రవీణ్ కుమార్ ప్రధాన కార్యదర్శి ముంద్రాతీ వంశి,గౌరవ అధ్యక్షులు కొడిశల ప్రశాంత్,ఉపాధ్యక్షులు బందెల కరుణాకర్, ముంద్రాతి భాను కుమార్, కోశాధికారి తిప్పారం కనకయ్య,కార్యవర్గ సభ్యులు అరిగే చింటూ,ముంద్రాతీ శివ, కోడిసెల రవి, కుక్కల ప్రవీణ్, గజ్వేల్ లింగం, బుర్రి మధు,ప్రచార కార్యదర్శి మిందె ప్రవీన్,అధికార ప్రతినిధి క్షీరసాగరం నర్సింలు, సలహాదారులు ఎడ్ల భూమయ్య, కోడిశెల గిరిబాబు, అరిగే అశోక్ కుమార్,ముంద్రాతీ రాజు,ముం ద్రాతీ కృష్ణ ,కుక్కల శ్రీనివాస్, కోడిశెల మల్లేశం, చంద ప్రవీణ్ కుమార్, ఎడ్ల రవి, గజ్వేల్ శైలేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవ సందర్భంగా వైద్య సిబ్బంది నిసన్మానించిన ఎమ్మెల్యే

జయభేరి, షాద్ నగర్, మార్చి 08 :




అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ షాద్ నగర్ డివిజన్ లో వైద్య శాఖలో పనిచేస్తున్న నందిగామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ స్రవంతి ని కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నికితని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చించోడు సూపర్వైజర్ శ్రీ రమ ను చించోడు ఏఎన్ఎం రమాదేవిని పిపి యూనిట్ ఏఎన్ఎం స్వప్నను, నందిగామ పి హెచ్ సి ఆశ అనిత కొందుర్గ పి.హెచ్.సి ఆశ విమల లను షాద్నగర్ శాసనసభ్యులు వేళ్ళపల్లి శంకర్ మెమెంటో లు ఇచ్చి శాలువా పూలదండలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ...కరోనా ఆపద సమయంలో వైద్య ఆరోగ్య సిబ్బంది వైద్య అధికారులు సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు మరియు ఆశాలు అందరూ వారి ప్రాణాలకు తెగించి సేవలు అందించారని కొనియాడారు. వైద్య శాఖ సిబ్బంది అందరూ చాలా బాగా పనిచేస్తున్నారని, ఇలాగే ఇక ముందు కూడా అందరూ మంచిగా పని చేయాలని తెలియజేశారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కి ఎమ్మెల్యే ఘనంగా సన్మానించినందుకు వైద్య సిబ్బంది ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలియజేశారు.




## మహిళా డిగ్రీ కళాశాల లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

జయభేరి, గజ్వేల్, మర్చి 08 :

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల గజ్వేల్ లో, వీరమాత అహల్యాబాయి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ స్త్రీలు విద్య నేర్చుకోవడం వల్ల సమాజంలో వ్యవస్థలో మార్పు వస్తుందని స్త్రీ పురుషులు సమానత్వంగా ఉండడానికి ఉపయోగపడుతున్నది అని వివరించారు.కళాశాలలో జరిగిన మహిళా దినోత్సవానికి ముఖ్యఅతిథి రిటైర్డ్ ప్రొఫెసర్ సుమిత్ర రాయి ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్ మాట్లాడుతూ ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం 1975 నుండి భారతదేశంలో, జరుపుతున్నారని సావిత్రిబాయి పూలే, రమాబాయి లాంటి వారి కృషి ఫలితంగా స్త్రీలకు విద్యను నేర్చుకోవడానికి అవకాశం ఏర్పడింది అని వివరించారు. ఈ కార్యక్రమాన్ని ఉమెన్ ఎంపవర్మెంట్ కన్వీనర్ డాక్టర్.సుజాత ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సి.పి.డి.సి మెంబర్స్ లక్ష్మణ్, డాక్టర్ నరేష్ బాబు, పరమేశ్వర చారి, డాక్టర్ శ్రీధర్, వైస్ ప్రిన్స్ పాల్స్ కమల క్రిస్టియాన, శ్రీలత, ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ ఎం ఎం లక్ష్మి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్.పి. జయరాజ్, కస్తూరిబాయి, డాక్టర్ శోభారాణి, డాక్టర్ జె .ఉమారాణి, డాక్టర్ శ్రీలత, డాక్టర్ సరోజ, డాక్టర్ సునీత, రమేష్, శ్రీధర్, శ్యామ్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వైభవంగా శ్రీ సీతారామ క్షేత్ర వార్షికోత్సవ సంబరాలు

- విమాన గోపుర సుదర్శన ప్రతిష్ట మహోత్సవం



జయభేరి, మార్కుక్, మర్చి 08 :

ప్రముఖ పాములపర్తి శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య గణపతి పూజ, విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యహవచనం, అంకురార్పణ, ధ్వజ స్థాపన, అగ్ని ప్రతిష్ట, జలాధివాసము, ప్రదోషకాల పూజ, మహాస్నపనము, వసంతోత్సవము, సుదర్శన హోమము, ధాన్య, శయ్యాధి వాసము తదితర కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి, మాజీ జెడ్పిటిసి ఏంబరి రామచంద్రం, మాజీ ఎంపీపీ పాండు గౌడ్, వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ధర్మకర్త హరిపంతులు వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్యాంసుందర్ గుప్త, కృష్ణారెడ్డి, కనకయ్య ముదిరాజ్, శ్రీనివాస్ గుప్త తదితరులు పాల్గొన్నారు. కాగా ఆదివారం పునర్వసు నక్షత్రం సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవం, విమాన గోపుర సుదర్శన ప్రతిష్ట తదితర జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

## శైలగిరి హాస్పిటల్ సేవలు భేష్



జయభేరి, జగదేవపూర్, మర్చి 08 :

జగదేవపూర్ మండల కేంద్రములో శైలగిరి హాస్పిటల్లో డా" రమేష్ ఎంబిబిఎస్ ఎండి న్యూరో ఫిజీషియన్ జేమీకేర్ ఫాలోమీ హాస్పిటల్ వారు ప్రతి శనివారం ఉదయం నుండి సాయంత్రం వరకు గత ఆరు నెలలుగా పేదలకు తక్కువ ఖర్చుతో అదునాతన పరికరాలతో వైద్య సేవలందిస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే పేదలకు నరాల బలహీనత, కండరాల బలహీనత, బీపీ,షుగర్ లతో పాటు పలు రకాల దీర్ఘకాల వ్యాధులకు మంచి చికిత్స అందిస్తూ పేదల మన్ననలు పొందుతున్న శైలగిరి హాస్పిటల్ వారు. ఈ సందర్భంగా శైలగిరి హాస్పటల్ డైరెక్టర్ యాదగిరి మాట్లాడుతూ చుట్టూ పక్కల నుండే కాకుండా పక్క మండలలు తుర్కపల్లి,రాజపేట్ నుండి సైతం ప్రజలు వచ్చి న్యూరో సేవలు పొందుతున్నారని పేర్కొన్నారు. పేద ప్రజలకు మా హాస్పిటల్ లో తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందిస్తున్నామని అన్నారు. ప్రజలు ఎవరికైనా తలనొప్పి, మైగ్రేన్,పక్షవాతం, పిట్స్ లాంటి సమస్యలు ఉంటే ప్రతి శనివారం డాక్టర్ రమేష్ ఎంబిబిఎస్ ఎండి న్యూరో ఫిజీషియన్ అందుబాటులో ఉంటారని ప్రజలు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

- ఎంజెపి కళాశాలలో ఘనంగా మహిళా దినోత్సవం




జయభేరి, వర్గల్, మర్చి 08 :

మహిళా శక్తి చాలా గొప్పదని వారు అన్ని రంగాల్లో ముందుడాలని కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్ గడ్డం భాస్కర్ రావు తెలిపారు. మహాత్మా జ్యోతి బాపూలే మహిళా డిగ్రీ కళాశాల వర్గల్ లో శనివారం మహిళా దినోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కోరారు.. వాయిస్ ప్రిన్సిపాల్ గోవిందరావు మాట్లాడుతూ మహిళల యొక్క విజయాలను తెలియజేశారు. విద్యార్థులు వీరనారీమణులుగా బ్రతకాలని దీవించారు.. ఏటీపీ ఉమామహేశ్వరి మాట్లాడుతూ మహిళలు ఎందులో తగ్గరని ప్రతి రంగంలో వాళ్ళు ముందుంటారని పేర్కొని విద్యార్థులు ఆశించిన స్థాయిలో ఉండాలని దీవించారు. ఇందులో కళాశాల అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.



# అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం నల్గొండ, జిల్లాస్థాయి స్పోర్ట్స్ మీట్ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు దేవరకొండ అసోసియేషన్ భవనము నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ప్రారంభమైనాయి. ఈ కార్యక్రమాన్ని అధ్యక్షుడు NVT, సభ్యులతో కలిసి ప్రారంభించినారు. మహిళలకు 100, 200 మీటర్ల పరుగు పందెం, మ్యాజిక్ చైర్ గేమ్, లెమన్ స్పూన్ ఆటలను నిర్వహించినారు.

ఈ యొక్క గేమ్స్ లో 82 మంది మహిళలు పాల్గొన్నారు అని సభా కార్యక్రమంలో మహిళలు ఎంతో ఉత్సాహంగా పాటలు పాడినారని మహిళల గొప్పతనం గురించి మాట్లాడినారని తెలియజేసినారు. అనంతరం ముఖ్య అతిథులుగా విచ్చేసిన PACS చిత్రియాల చైర్మన్ జాల నర్సింహారెడ్డి, అధ్యక్షుడు NVT, మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, గెలుపొందిన వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మొదట అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవం అనే వారని, స్త్రీ గొప్పతనం వెలకట్టలేనిదని, అన్ని రంగాలలో స్త్రీలు ముందుంటున్నారని, ఇప్పుడున్న పరిస్థితులలో పిల్లల భవిష్యత్తు తల్లిదండ్రులపై ఆధారపడి ఉందని, మహిళలకు ఎంతో ఓపిక ఉందని అందుకే వారిని భూదేవితో పోలుస్తారని. మహిళల విజయాలని గౌరవించుకోవడం, వాళ్ల గొప్పతనాన్ని చాటి చెప్పుకోవడం గర్వించదగ్గ విషయమని మహిళల గురించి ఎంత చెప్పినా తక్కువేనని ఈ సందర్భంగా వారు అన్నారు.

అనంతరం గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేసినారు. కబడ్డీలో జాతీయ స్థాయిలో రెండుసార్లు ఆడిన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థినిలు పూజ మౌనిక లని, కే సుజాత, జయలక్ష్మి, మహిళా దినోత్సవ సందర్భంగా వీరిని శాలువాలతో సత్కరించి మెమొంటోస్ అందజేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసినారు.

అనంతరం జిల్లా స్పోర్ట్స్ మీట్ లో భాగంగా కబడ్డీ, షటిల్ బ్యాట్మెంటన్ వాలీబాల్ పోటీలని జాల నర్సింహారెడ్డి అధ్యక్షుడు NVT, సభ్యులతో కలిసి ప్రారంభించినారు. 26 టీములు పాల్గొన్నట్టు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, రాపోలు నిరంజన్, లీగల్ అడ్వైజర్ ఉమా మహేష్, k పంతుల నాయక్ ,బత్తుల అమర్ ,వైయస్ కరుణాకర్, AE చందు నాయక్, సన్నీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ తాళ్ల సురేష్, ముత్యాల రవి, కరాటే మాస్టర్ శ్రీను, లచ్చిరాం, డాన్స్ మాస్టర్ జగన్, PET లు చరణ్, మెట్టిల్డ స్కూల్ PET సంధ్య, వినోద్, మౌనిక, రాధా, భవాని, శైలజ, పద్మ, సంధ్య, అనూష రేణుక, అరుణ, కృష్ణవేణి, నిర్మల, శోభ, క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ ఆర్టీసీ డిపోలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఘనంగా వేడుకల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సీనియర్ సివిల్ జడ్జి కే.అనిత పాల్గొని మాట్లాడుతూ.. ముందుగా మహిళలకు "ఉమెన్స్ డే" శుభాకాంక్షలు తెలిపారు. మహిళలకు పూర్తిస్థాయిలో భద్రత, రక్షణ ఉంటుందని, మహిళలకు వారి హక్కులపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగినిలకే కాకుండా ప్రతి మహిళకు హక్కుల గురించి తెలిసి ఉండాలని పలు సూచనలు చేశారు.

పోలీస్ డిపార్ట్మెంట్, న్యాయ వ్యవస్థ హక్కుల్ని కాపాడేందుకు కృషి చేస్తుందని, ఎలాంటి భయం లేకుండా ఫిర్యాదు చేయాలని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఇకముందు కూడా ఇదే స్ఫూర్తి, ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలని అన్నారు. చదువుతోనే మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. మహిళ సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. అదేవిధంగా ఆర్టీసీ డిపోలో బస్ స్టేషన్లలో పనిచేస్తున్న మహిళ పారిశుధ్య సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు.

అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. ఇప్పటికే పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారని, ఇకముందు కూడా ఇదే స్ఫూర్తితో, చైతన్యంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల ఆంజనేయులు, న్యాయవాదులు, ఆర్.ఎస్.రావు, దీప్ లాల్, నారాయణ, వెల్ఫేర్ బోర్డు మెంబర్ లు సమద్, పాపరాజు ఆర్టీసీ ఉద్యోగులు మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా మహిళల దినోత్సవ వేడుకలు

**జయభేరి, పరవాడ :**

మార్చి 8 మహిళ దినోత్సవం పురస్కరించుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరవాడ నందు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా డాక్టర్ హారిక మాట్లాడుతూ మహిళలు ఆర్థికముగా ఎదిగే విధంగాను, అన్ని రంగాల్లో మహిళలకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందించాలి. ఆడపిల్లల పట్ల వివక్షతను చూపకూడదు. మగ పిల్లల తో సమానంగా చదివించాలి. బాల్య వివాహాలు జరగకుండా, మహిళలపై దాడులు జరగకుండా, చట్టాలను కఠినతరం చేయాలని ఆమె తెలియజేశారు. అనంతరం వాసవి క్లబ్ పరవాడ వారు వైద్యరంగంలో విశేష సేవలు అందించిన డాక్టర్. హారిక, డాక్టర్. జయశ్రీ కరిష్మా, డాక్టర్. శిరీష లను దుశాలువా మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, మరియు వాసవి క్లబ్ ప్రెసిడెంట్ పులవర్తి నూక రత్నం, సెక్రటరీ పచ్చిపులుసు లక్ష్మి, జంగాల తులసి బండారు ఆశ, జంగాల ప్రసన్న, ప్రభ తదితరులు పాల్గొన్నారు.

# ఆటల పోటీలలో గెలిచిన క్రీడాకారిణిలకు బహుమతులు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో మహిళలకు కబడ్డీ పోటీలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిత్రియాల శ్రీమంతులు నాయకులు జాలే నరసింహా రెడ్డి పీసీసీ సభ్యులు PACS చైర్మన్ పాల్గొని గెలిచినవారికి బహుమతులు అందజేయడం జరిగింది అనంతరం నరసింహా రెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే ఏ సమాజం అయినా సంపూర్ణంగా పురోగమిస్తోంది అన్నారు అదే విధంగా ప్రతీ స్త్రీ తన కలల సాకారానికి ఆనందానికి అర్హురాలు ...అలాంటి స్త్రీలు అందరూ ఆనందంగా ఉండాలని కోరుకుంటూ... మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు NVT శ్రీధర్ గౌడ్, AE చందు, పంతులాల్, కరుణాకర్, వైఎస్అమర్, సురేష్, సన్నీ, లచ్చిరాం, సుజాత, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి సతీమణిని సన్మానించిన షాద్ నగర్ బిజెపి నాయకులు



**జయభేరి, షాద్ నగర్, మార్చి 08 :**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి సతీమణి రామాదేవిని షాద్ నగర్ బిజెపి నాయకులు ఘనంగా సత్కరించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, విజయ్ బాస్కర్, మోహన్ సింగ్, పసుల నర్సింహా యాదవ్, చేగు సుధాకర్,శ్యామ్ సుందర్ రెడ్డి, అత్తాపురం మహేందర్ రెడ్డి, గడ్డమిది రాజు,కరెడ్ల నరేందర్ రెడ్డి,మిద్దె గణేష్,కుమ్మరి మహేష్,బాల్ రెడ్డి, కృష్ణ, సుదీర్ పటేల్,గోపాల్ రెడ్డి,కల్వకొలు తిరుపతి,శ్రీనివాస్, రాజు నాయక్,తదితరులు పాల్గొన్నారు.

# అరుదుగానే అందం

స్కిన్నీ జీన్స్, టైట్ టాప్స్ లాంటి టైట్ దుస్తులతో కాస్త జాగ్రత్త. ఇవి శరీరంలో రక్త ప్రవాహాన్ని దెబ్బతీస్తాయి. వీటిని రెగ్యులర్‌గా ధరిస్తే.. దీర్ఘకాలంలో రకరకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. రక్తప్రసరణ సజావుగా సాగపోవడం వల్ల నడుము, ఛాతీ కండరాల్లో తిమ్మిర్లు వచ్చే ప్రమాదం ఉంది. పొట్టని బాగా అదిమిపట్టి ఉంచడం వల్ల అసిడిటీ కూడా రావొచ్చు. ఫిట్‌గా, స్లిమ్‌గా కనిపించాలని వేసుకునే స్కిన్‌టైట్ దుస్తుల వల్ల కలిగే అనర్థాలు ఇవి. అందుకే, వదులుగా, మీకు సౌకర్యవంతంగా ఉండే దుస్తులనే ధరించడానికి ప్రాధాన్యం ఇవ్వండి. స్కిన్‌టైట్ ఫ్యాషన్ అరుదుగా పాటిస్తేనే అందం, ఆరోగ్యం.



# ఘనంగా అయ్యప్ప కాలనీ వృద్ధాశ్రమంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

- వేడుకలు నిర్వహించిన రంగారెడ్డి జిల్లా బీసి మహాసభ
- మహిళా దినోత్సవం సందర్భంగా వృద్ధాశ్రమంలో సన్మానించి పాలు, పండ్లు, బ్రేడ్ లు పంపిణీ
- పంపిణీ చేసిన రంగారెడ్డి జిల్లా బీసీ మహా సభ యువత అధ్యక్షులు శ్రీధర్ వర్మ ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్



**జయభేరి, షాద్ నగర్, మార్చి 08 :**

రంగారెడ్డి జిల్లా బీసీ మహా సభ యువత అధ్యక్షులు శ్రీధర్ వర్మ ముదిరాజ్ ,రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు క్యాసెట్ శ్రీనివాస్ యాదవ్, ఇరువురి ఆధ్వర్యంలో జాతీయ అధ్యక్షులు మెట్టుకాడి శ్రీనివాస్ ఆదేశం మేరకు ఈ రోజు షాద్ నగర్ నియోజకవర్గంలోని నవోదయం వృద్ధాశ్రమం అయ్యప్ప కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఆశ్రమంలో మహిళా వృద్ధులను సగర్వంగా అందరిని శాలువాతో సన్మానించి వారికి పండ్లు, బ్రెడ్లు అందజేయడం జరిగింది. అనంతరం బీసీ మహాసభ యువత అధ్యక్షులు శ్రీధర్ వర్మ మాట్లాడుతూ.... అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరి మాతృమూర్తిగా చూడాలి సృష్టిలో స్త్రీ గొప్పతనం వెలగట లేనిది ప్రతి ఒక్కరూ మహిళలని గౌరవించాలని విద్య ఉద్యోగం రాజకీయ రాజకీయ అన్ని రంగాలలో స్త్రీలకు సమన్యాయం జరగాలి మరియు ఝాన్సీ లక్ష్మీబాయి, రుద్రమదేవి, సావిత్రిబాయి పూలె మహనీయులైన వీరందరినీ ఆదర్శంగా తీసుకోవాలని శ్రీ సృష్టికి మూలం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనపాటి ప్రదీప్ కుమార్, బీసీ మహాసభ గౌరవ అధ్యక్షులు మహేష్‌వర్మ, బిసి మహాసభ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణాజి, రంగారెడ్డి జిల్లా బీసీ మహాసభ అధ్యక్షురాలు అనుష గౌడ్, బీసీమసభ ప్రధాన కార్యదర్శి జూలపల్లి అనసూయమ్మ ముదిరాజ్, బిసి మాసభ మహిళా జూలపల్లి పుష్పలత, బిసి మహాసభ గౌరవ సభ్యులు పద్మ కృష్ణయ్య, బీసీ మహాసభ సంస్కృతం విభాగం జిల్లా అధ్యక్షులు కూతలు వేణుగోపాల్, బీసీ మహాసభ కోశాధికారి వెంకటాచారి, బీసీ మహాసభ కార్య నిర్వాక కార్యదర్శి చల్ల భరత్, బిసి మహాసభ సభ్యులు శ్రీనివాస్ చారి, యాదయ్య , మలేష్, తదితరులు పాల్గొన్నారు.

# సునరిత దంపతులను పరామర్శించిన తలసాని

**జయభేరి, హైదరాబాద్:**

మలక్ పేట కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు అజిత్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సునరిత రెడ్డి దంపతులను శనివారం మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. వారి కుమారుడు కనిష్క్ రెడ్డి ఓఆర్ఆర్ పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. విషయం తెలుసుకున్న తలసాని శ్రీనివాస్ యాదవ్ శనివారం ముసారాం బాగ్ లోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించి తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆజాం, సామా ప్రభాకర్ రెడ్డి, విఠల్ రెడ్డి, నర్సింగ్, నరేష్ తదితరులు ఉన్నారు.


# అంతర్జాతీయ ఏడ్యుకేషన్ ఫెయిర్ కు అపూర్వ స్పందన

**జయభేరి, హైదరాబాద్:**

ఓరియంట్ స్పెక్ట్రా అధ్వర్యంలో అంతర్జతీయ ఏడ్యుకేషన్ ఫెయిర్ కు అపూర్వ స్పందన లభించింది. బంజారాహిల్స్ లోని తాజ్ డెక్కన్ హోటల్ లో ఒక రోజు ఎడ్యుకేషన్ ఫెయిర్ ఘనంగ ఎర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఓరియంట్ స్పెక్ట్రా మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ విదేశాల్లో చదువుకోవాలి అనే విద్యార్థులకు ఇ వేదిక చక్కని అవకాశం అని అన్నారు. వివిధ దేశాల్లోని యూనివర్శిటీలు అందిస్తున్న కోర్సులు, ఫీజులు, హాస్టల్ సదుపాయాలు, ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యాభై పైగా విదేశీ యూనివర్సిటీ ల నుంచి ప్రతినిధులు వచ్చారు అని అన్నారు. విద్యార్థులకు విదేశాలకు ఎలా వెళ్ళాలి ఎలా చదువు కోవాలి అనే విషయాలపై అవగాహన కోసం ఈ యొక్క ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించామని ఓరియంట్ స్పెక్ట్రా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

# ఉత్కంఠగా '23' టీజర్

మల్లేశం, 8 ఏఎమ్ మెట్రో వంటి ప్రయోగాత్మక చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించిన దర్శకుడు రాజ్ రాచకొండ. ఇప్పుడు ఆయన దర్శకత్వంలో రాబోతున్న మరో సంచలన చిత్రం 23. మన సమాజంలో చట్టం అందరికీ సమానంగా వర్తిస్తుందా. ! అనే ట్యాగ్‌లైన్‌తో ఈ సినిమా రాబోతుంది. తేజ, తన్మయ, ఝాన్సీ ప్రధాన పాత్రలు పోషిస్తుండగా.. రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా నిర్మాణంలో ఓ సినిమా రూపొందుతోంది. తెలుగుతో పాటు తమిళం, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కాబోతుంది. నేడు మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ టీజర్ చూస్తుంటే.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో 1991లో జరిగిన చుండూరు మారణకాండ ఘటన తో పాటు, 1993 చిల కలలూరి పేట బస్సు దహనం, 1997 హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లో జరిగిన కార్ బాంబు దాడి ఘటనల ఆధారంగా ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. ఈ ఘటనలో చని పోయిన వారి కథ ఒక లాగే ముగియగా.. ఈ ఘటనలకు పాల్పడిన హంతకుల కథ ఏం అయ్యింది అనే స్టోరీతో ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. చూస్తుంటే దర్శకుడు రాజ్ రాచకొండ ఈసారి ఏదో సంచలనం సృష్టించబోతు న్నట్లు తెలుస్తుంది.






# మత్తెక్కిస్తున్న టిల్లుగాడి గర్ల్ ఫ్రెండ్..

టాలీవుడ్ లో సూపర్ హిట్ గా నిలిచిన సినిమాల్లో డీజే టిల్లు సినిమా ఒకటి. యంగ్ హీరో సిద్దు జొన్నలగడ్డ హీరోగా నటించిన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. అదే రేంజ్ లో పాపులర్ అయ్యింది క్రేజీ బ్యూటీ నేహా శెట్టి. తన అందంతో క్యూట్ నెస్ తో ప్రేక్షకులను అలరించింది ఈ భామ. పూరిజగన్నాథ్ తనయుడు ఆకాష్ పూరి హీరోగా వచ్చిన మెహబూబా సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది నేహా శెట్టి. సందీప్ కిషన్ హీరోగా వచ్చిన గల్లీ రౌడీ మూవీలో హీరోయిన్ గా చేసిన ఈ బ్యూటీ ఆ సినిమా తర్వాత అఖిల్ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ లో చిన్న పాత్రలో నటించింది. ఇక డీజే టిల్లు సినిమాతో ఈ బ్యూటీకి కావాల్సినంత క్రేజ్ వచ్చింది. డీజే టిల్లు సినిమా తర్వాత ఈ చిన్నది వరుసగా సినిమాలు చేసింది కానీ ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేకపో యింది. దాన్ తో ఈ అమ్మడికి ఆఫర్స్ కరువయ్యాయి. ప్రస్తుతం నేహా శెట్టి స్పీడ్ తగ్గించింది. కాగా పవన్ కళ్యాణ్ సినిమాలో స్పెషల్ సాంగ్ చేస్తుందని టాక్. సినిమాలతో పాటు సోషల్ మీడియాలో గ్లామర్ ఎటాక్ తో ఫాలోవర్స్ ని ఆకట్టుకుంటుంది నేహా శెట్టి. రెగ్యులర్ గా తన గ్లామరస్ ఫోటోలను షేర్ చేస్తూ అభి మానులను ఆకట్టుకుంటుంది ఈ వయ్యారి భామ. ఈ క్రమంలోనే తాజాగా కొన్ని ఫోటోలు వదిలింది.



# ఈ క్యూటీని గుర్తుపట్టారా ?..

పవన్ కల్యాణ్ మొదటి సినిమా టైటిల్ 'అక్కడ అమ్మాయి ఇక్కడ అమ్మాయి' పేరుతో తెరకెక్కుతోన్న సినిమాలో ప్రదీప్, దీపికా పిల్లి హీరో, హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శర వేగంగా జరుగుతోంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి రిలీజైన పోస్టర్స్, గ్లింప్స్ అభిమానులను బాగానే ఆకట్టుకున్నాయి. సినిమాపై పాజిటివ్ వైబ్ ను తీసు కొచ్చాయి. ఇక దీపికా పిల్లికి ఇది రెండో సినిమా. ఈ సినిమా సక్సెస్ అయితే ఈ అమ్మడికి మరిన్ని చిత్రాల్లో అవకాశాలు రావొచ్చు. ఓ వైపు హీరోయిన్ గా సినిమాలు చేస్తూనే మరోవైపు టీవీ షోలతోనూ బిజి బిజీగా ఉంటోందీ అందాల తార. ఇక సోషల్ మీ డియాలోనూ ఈ ముద్దుగుమ్మకు ఓ రేంజ్ లో ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది.



# అర్జున్ సన్నాఫ్ వైజయంతి

కల్యాణ్‌రామ్ నటిస్తున్న తాజా చిత్రానికి 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్నారు. శనివారం మహిళా దినోత్సవం సందర్భంగా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో విజయశాంతి ఐపీఎస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తు న్నారు. మండుతున్న జ్వాలల మధ్య నడిచి వస్తున్న కల్యా ణ్‌రామ్, విజయశాంతి పాత్రలు కథలోని ఇంటెన్సిటీని ప్రజెంట్ చేసేలా ఉన్నాయి. 'యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ఇప్పటికే టాకీ పార్ట్ పూర్తయింది. త్వరలో రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తాం' అని చిత్రబృందం పేర్కొంది. సో హైల్‌ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్ తదితరులు నటిస్తు న్న ఈ చిత్రానికి కెమెరా: రామ్‌ప్రసాద్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, నిర్మాతలు: అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు, రచనదర్శకత్వం: ప్రదీప్ చిలుకూరి.


Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com